

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 16 ఏప్రిల్ 2025





విమానాశ్రయంతో సత్వర ఆర్థికాభివృద్ధి!

రాజధాని నగరంలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించే ప్రాజెక్టుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమైంది. దీని వల్ల రాజధానిలో వ్యాపార, వాణిజ్యాభివృద్ధి జరుగుతుంది. మల్టీనేషనల్ కంపెనీల కార్యాలయాలు, కర్మాగారాలు ఏర్పాటు చేయటానికి దోహదపడుతుంది. ఎగుమతి, దిగుమతులను పెంపొందిస్తుంది.



బెంగళూరు విమానాశ్రయం ఐటీ హార్డ్‌వేర్ ట్రేడ్‌ను గణనీయంగా ప్రోత్సహిస్తోంది. అమరావతికి కూడా అందుకు అనుగుణమైన వ్యాపారాలను పెంచటానికి దోహదపడుతుంది. విమానాశ్రయం వల్ల మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా అప్‌గ్రేడ్ అవుతాయి. రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందుతాయి. కార్గో, లాజిస్టిక్ హబ్‌గా కూడా అభివృద్ధి చెందుతుంది. పండ్లు, పూలు, ఔషధాల ఎగుమతులకు దోహదపడుతుంది. ముంబయి విమానాశ్రయం ఒక్కటే 40శాతం ఎయిర్ కార్గోను నిర్వహిస్తోంది. ఈ విమానాశ్రయం వల్ల స్థానికంగా రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతుంది. విమానాశ్రయం చుట్టూ ఉండే భూములు 300 నుంచి 500 శాతం వరకు పెరుగుతాయన్నది అంచనా. స్థానిక వస్తువులకు గ్లోబల్ మార్కెట్ లభిస్తుంది. దీంతో పాటు ఆరోగ్య, విద్యా సదుపాయాలు పెరుగుతాయి. పర్యాటకరంగం కూడా అభివృద్ధి చెందుతుంది. ఇన్ని ఆర్థిక పరమైన ప్రయోజనాలున్నందునే ముందుగా అంతర్జాతీయ విమానాశ్రయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఐదు వేల ఎకరాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం తక్షణం భూములను సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

10 వేల ఎకరాల భూ సమీకరణ!

అమరావతికి దగ్గరగా ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతంలో ఉన్న 10 వేల ఎకరాల భూములను యుద్ధ ప్రాతిపదికన సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. యండ్రాయి, కర్లపూడి, తాడికొండ, వైకుంఠపురంలోని భూములను టాప్-3 ప్రాధాన్యతా ప్రాజెక్టుల కోసం తీసుకోవాలని యోచిస్తోంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి ఐదు వేల ఎకరాలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం 2,500 ఎకరాల చొప్పున తీసుకోవాలన్నది ఆలోచన. అవసరమైన భూములను తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంగీకారం తెలిపినట్టు సమాచారం. మిగిలిన భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం తర్వాత తీసు కోవాలని చూస్తున్నారు. అయితే భూ సమీ కరణ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

- ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య సీఆర్‌డీఏ ఎంపిక
- ఎయిర్ పోర్టుకు 5 వేలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్క్‌కు 2,500, స్పోర్ట్స్ సిటీకి 2,500 ఎకరాలు
- గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులు పూర్తయిన రెండేళ్లకు మరో 34 వేల ఎకరాల సమీకరణ
- మల్టీ కనెక్టివిటీ కోసమే.. ఇన్నర్, అవుటర్ మధ్య ప్రాంతం గుర్తింపు
- తుళ్లూరు మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయం !
- ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు భూములు తీసుకోవాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ):
రాజధాని అమరావతిని పరిపాలనా కేంద్రంగానే కాకుండా సమాంతరంగా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ సూచించిన విధంగా ఆర్థికాభివృద్ధిని తీసుకురావటానికి వీలుగా అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీలను (మిగతా 6వ పేజీలో)

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుతో పర్యాటక రంగ అభివృద్ధి



స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుకు కూడా భూములను సమీకరించాలని నిర్ణయించింది. స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా అమరావతి సత్వరాభివృద్ధికి దోహదపడుతుంది. స్పోర్ట్స్ సిటీ అనేది క్రీడలు, ఫిట్‌నెస్, వినోద కేంద్రంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి క్రీడా స్టేడియాలు, ట్రైనింగ్ అకాడమీలు, స్పోర్ట్స్ మ్యూజియాలు, ఫిట్‌నెస్ సెంటర్లు, హోటళ్ల రిటైల్ మాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, ఆటగాళ్లు, కోచ్‌ల రెసిడెన్షియల్ జోన్లు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ సిటీ వల్ల పర్యాటక రంగం, రియల్ ఎస్టేట్ బూమ్, స్థానిక వ్యాపారం పెరగటం, ఉద్యోగాల కల్పన పెద్ద ఎత్తున జరుగుతుంది.

సాగుకు.. మంచి రోజులు

సాగర్ కుడి కాలువ పరిధిలో మరమ్మతులు

- సమాయత్త మవుతున్న జలవనరుల శాఖ
- మూడు జిల్లాల్లో 355 పనుల గుర్తింపు
- రూ.19.28 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వానంగా ఉన్న కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. కాల్వల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులను జల వనరుల శాఖ గుర్తించింది. రూ.19.28 కోట్లు వ్యయం అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వారంలో నిధుల మంజూరుపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని అధి కారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాల్వల మరమ్మతులను విస్మరిం చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాల్వల మరమ్మతులకు రూ.22.54 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. మరో విడత నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది.

దుస్థితిలో కాల్వలు

మేజర్, మైనర్, సబ్ మైనర్ కాల్వలన్నీ అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. దీంతో సాగు నీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాల్వల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటికాడ, రబ్బరు మొక్కలు అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయి.. షట్టర్లు దెబ్బతిన్నాయి, చాలా మైనర్ కాల్వల తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సరఫరాలో నియంత్రణ ఉండడం లేదు. నీటి పారుదల సమయంలో నాచు పెరుగుతోంది. నాచు పెరిగిన వెంటనే తొలగించకపోతే దిగువకు నీరు పూర్తిస్థాయిలో సరఫరా కాదు.

అధికారుల నిర్లక్ష్యం..నేతల జోక్యం

ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. జనవనరుల శాఖ అధికారులు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తొలి విడతగా రూ.22.54 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ పనులు చేపట్టేందుకు గతేడాది మరమ్మతుల టెండర్లు నిర్వహించింది. కొందరు అధికార పార్టీ నేతలు అనుచరులకు పనులు దక్కకపోవడంతో బలవంతంగా టెండర్లు రద్దు చేయించారు. తిరిగి టెండర్లు నిర్వహించి, పనులు చేపట్టే అంశంలో అలసత్వం తాండవిస్తోంది. మాచర్ల, సత్తెనపల్లి డివిజన్‌లలో కాల్వల మరమ్మతులు పూర్తి చేశారు. వినుకొండ పరిధిలో 34 పనులు వ్యయం అంచనా రూ.1.78 కోట్లు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. 24 పనులు చేప ట్టారు. మిగతా పది పనులు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేసే ప్రక్రియ జరుగుతోంది. లింగంగుంట్ల ఓఅండ్ ఎం డివిజన్ పరిధిలో 77 పనుల వ్యయం అంచనా రూ.4.21 కోట్లు. ఈ పనుల టెండర్ ప్రక్రియ పూర్తిచేయడంలో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఇక్కడ అధికార పార్టీ నేతలు టెండర్లు నిర్వహించకుండా అడ్డుతగులుతున్నారన్న విమర్శలున్నాయి. కాల్వలకు నీటి సరఫరా కూడా నిలిపివేశారు. అధికార పార్టీ నేతలు కరుణి స్తేనే ఈ డివిజన్‌లో పనులు జరిగే దుస్థితి నెలకొంది. ఈ రెండు డివిజన్‌లలో తొలి విడత నిధులతో పనులు పూర్తి చేయడంలో విఫల మైన అధికారులు.. రెండో విడత నిధుల కోసం ప్రతి పాదనలు సిద్ధం చేయడం గమనార్హం. కాలువల మరమ్మతులపై అధికార పార్టీ నేతల జోక్యం రైతులకు శాపంగా మా రింది. సాగు నీటి సంఘాలు కాల్వల మర్మతులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

355 మరమ్మతు పనుల గుర్తింపు

వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్లలో 355 అత్యవసర మరమ్మతులను అధికారులు గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.19.28 కోట్ల వ్యయం అంచనా వేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనుల నిర్వహణకు రూ.2.17 కోట్లు, గురజాల నియోజకవర్గంలో 31 పనులకు రూ.2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ.2.34 కోట్లు, పెదకూరపాడు సెగ్మెంట్‌లో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజక వర్గంలో 34 పనులకు రూ.2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ.2.30 కోట్లు, చిలకలూరిపేట సెగ్మెంట్‌లో 29 పనులకు రూ.1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులకు రూ.1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గంలో 54 పనులకు రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా ప్రతిపాదనలు పంపించడం జరిగింది.



షట్టరు లేని తూము

హేతుబద్ధమే.. ప్రభుత్వ నిబద్ధత!

సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్దీకరణకు సిద్ధమైంది. అనసవర ఖర్చులు తగ్గించి, పాలనలో పారదర్శకత పెంచి, ఉద్యోగుల విధులు సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో గతంలో గ్రామాల ప్రాతిపదికన ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటైన సచివాలయాలు సగానికి పైగా తగ్గనున్నాయి. వీటిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి జవాబుదారీతనం తీసుకురానుంది.

- గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్
- జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ గ్రేడ్‌లుగా విభజన
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,583 సచివాలయాలు
- సగానికి తగ్గి... 798కి సంఖ్య పరిమితం
- గతంలో గ్రామాల ప్రాతిపదికన ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్దీకరణ(రేషనలైజేషన్) ప్రక్రియ ప్రారంభమైంది. జనాభా ప్రాతిపదికన హేతుబద్దీకరణకు అధికారుల కసరత్తు దాదాపుగా ముగిసింది. ఒకటి రెండు చోట్ల తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం అధికారులు తయారు చేసిన జాబితానే తుది ఆమోదం పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,583 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండ గా ప్రస్తుతం ఆ సంఖ్య 798కి పరిమితం కానుంది. సగానికి పైగా సచివాలయాల సంఖ్య తగ్గనుంది. గుంటూరు జిల్లాలో 568 సచివాలయాకు 282, పల్నాడు జిల్లాలో 538 సచివాలయాలకు 268, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలకు 248 మిగలనున్నాయి. గ్రామాల ప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన హేతుబద్దీకరణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్ అధికారులు ఇప్పటికే హేతుబద్దీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని ప్రభుత్వ ఆమోదం కోసం మంగళవారం సాయంత్రానికి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఎంపీడీఓలు అప్రమత్తమయ్యారు. అయితే, జాబితాలు సిద్ధం చేసిన తర్వాత వాటిని స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల సూచనల మేరకు ఒకటీ రెండు చోట్ల మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

మూడు గ్రేడులు

గ్రామ, వార్డు సచివాలయాలను జనాభా ప్రాతిపదికన ఎ, బి, సి గ్రేడ్‌లుగా ప్రభుత్వం విభజించనుంది. 2,500 మంది జనాభా ఉన్న సచివాలయాలను ఏ గ్రేడ్, 2,500 నుంచి 3,500 మంది జనాభా ఉన్న సచివా లయాలను బీ గ్రేడ్, 3,500మందికి పైగా జనాభా ఉన్న సచి వాలయాలను సీ గ్రేడ్ కిందకు తేనున్నారు. ఏ గ్రేడ్ సచివాలయంలో ఆరుగురు, బీ గ్రేడ్‌లో ఏడుగురు, సీ గ్రేడ్‌లో 8 మందికి పైగా సిబ్బందిని కేటాయిస్తారు. ప్రతి సచివాలయంలో ఒక సెక్రటరీ లేదా డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. సిబ్బందిని కూడా టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి విధులు అప్పగిస్తారు.



సంక్షేమం..నిర్లక్ష్యం



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

- సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా ఇన్‌చార్జి
- వసతి గృహాలపై కొరవడని పర్యవేక్షణ
- అనేక ఘటనలతో తల్లిదండ్రుల్లో ఆందోళన
- విద్యార్థుల భద్రతపై ఉత్పన్నమవుతున్న ప్రశ్నలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): సాంఘిక సంక్షేమ శాఖలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. ఇన్‌చార్జి పాలనలో విద్యార్థుల సంరక్షణపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. శాఖ డిప్యూటీ డైరెక్టర్ మూడు నెలలుగా సెలవులో ఉన్నారు. ఐదేళ్ల నుంచి ఆ పోస్టులో ఒకరే కొనసాగు తున్నారు. ఈ సమయంలో వసతి గృహాల పర్యవేక్షణ, పరిపాలనపై అనేక విమర్శలు వచ్చాయి. నూతన ప్రభుత్వంలో కొన్ని ఘటనలు వసతి గృహాల్లో చోటు చేసుకోవడంతో దీర్ఘకాలంగా ఉన్న డీడీని మార్చాలని తీవ్రస్థాయిలో ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ డైరెక్టర్ ఆరోగ్య సమస్యలతో సెలవు పెట్టారు. అప్పటి నుంచి అర్హత లేకున్నా సూపరింటెండెంట్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన కంటే సీనియర్లు ఉన్నా పట్టించుకోకపోవడంపై అనేక విమర్శలు వచ్చాయి. తాజాగా బాపట్ల డిప్యూటీ డైరెక్టర్‌ను గుంటూరు జిల్లా ఇన్‌చార్జిగా నియమిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పర్యవేక్షణ కరువు..

మరోవైపు సంక్షేమ శాఖలో బదిలీలు, ఉద్యోగోన్నతులు, కారుణ్య నియామకాలపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఇందుకు భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. గడచిన ఐదేళ్లలో హాస్టల్స్ పర్యవేక్షణపై డీడీ ఒక్కసారి కూడా వెల్ఫేర్ ఆఫీసర్లతో సమీక్షించిన దాఖలాలు లేవని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మెనూ సక్రమంగా అమలు చేయకుండా, కళాశాల వసతిగృహాల్లో వెల్ఫేర్ ఆఫీసర్లు తప్పుడు హాజరుతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు.

వసతి గృహాల్లో పర్యవేక్షణ లోపాలు

- సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పర్యవేక్షణ లోపం తీవ్ర స్థాయిలో ఉంది. క్షేత్రస్థాయిలో వెల్ఫేర్ ఆఫీసర్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- పట్టాభిపురంలోని వసతి గృహంలో ఓ విద్యార్థినిని నిర్బం. దానికి గురికావడం కలకలం రేపింది.
- నగరం నడిబొడ్డున మరో కళాశాల వసతిగృహంలో ఓ విద్యార్థిని గర్భం దాల్చి, బిడ్డను జన్మించిన గుర్తించలేని దుస్థితి నెలకొంది.
- నగరంపాలెం సమీపంలోని హాస్టల్‌లో విద్యార్థినులను లైంగికంగా వేధించడం, దీనికి సిబ్బంది సహకరించడం కలకలం రేపింది.
- తాజాగా నగరంపాలెంలోని రెండు వసతిగృహాల్లో సక్రమంగా భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు అన్న క్యాంటీన్ ఆశ్రయించడం చర్చనీయాంశమైంది. ఇదే హాస్టల్‌కు చెందిన కొంతమంది విద్యార్థులు ఇంటి నుంచి కుక్కర్లు తెచ్చుకొని గదుల్లో భోజనం తయారు చేసు కుంటున్నారు.
- ఇక్కడ తప్పుడు హాజరు నమోదుపై ఏఎస్‌డబ్ల్యూఓ స్థాయి అధికారులు విచారణ చేసి నివేదిక అందజేశారు. కానీ, ఇంతవరకు సంబంధిత హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఈఎస్ఐ ఆస్పత్రికి భూమి

- నడింపాలెంలో 6.35 ఎకరాల్లో నిర్మాణం
- భూ కేటాయింపునకు కేబినెట్ ఆమోదం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తి పాడు మండలంలోని నడింపాలెం గ్రామంలో ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈ ఎస్ఐసీ) ఆస్పత్రి నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. నడింపాలెంలోని సర్వే నంబరు. 110-02 లోని 6.35 ఎకరాల భూమిని ఉచితం/ నామమాత్రపు లీజు ప్రాతిపదికన ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించేందుకు ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. ఇక్కడ 100 పడకల ఈఎస్ఐసీ ఆస్పత్రితో పాటు సిబ్బంది నివాసాల నిర్మాణం కోసం భూమిని కేటాయించేందుకు స్థలం అనువుగా ఉన్నది. ఈఎస్ఐసీకి అవసరమైన భూమిని ఇచ్చేందుకు కేబినెట్ ఆమోద ముద్ర తెలిపిన నేపథ్యంలో మరికొన్ని నెలల్లోనే ఆస్పత్రి, సిబ్బంది నివాసాల భవనాల నిర్మాణం మొదలవుతుంది. ప్రస్తుతం ఈఎస్ఐ ఆస్పత్రి గుంటూరు నగరంలోని దేవాపురంలో ఉంది. ఇక్కడ వైద్యసేవలు అంతంత మాత్రంగానే ఈఎస్ఐ కార్డుదా రుల కుటుంబాలకు అందు తున్నాయి. చాలావరకు రిఫరల్ ఆస్పత్రులకే రోగులను వైద్య చికిత్సల కోసం పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో 100 పడకల ఆస్పత్రి ప్రత్తిపాడు నియోజకవర్గంలో నిర్మాణం జరిగితే జిల్లాలోని ఈఎస్ఐ లబ్ధిదారులందరికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

బొమ్మువానిపాలెం-14 రీచ్‌లో ఇసుక తవ్వకాలు చేసే కాంట్రాక్టుని గతంలో మెస్సర్స్ నాగేంద్ర ఇన్‌ఫ్రా ఏజెన్సీకి కేటాయించా రు. అయితే ఆ సంస్థ వివిధ కారణాలతో 34,254 మెట్రిక్ టన్నుల ఇసుకని సరఫరా చేయలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ బ్యాలెన్స్ స్టాక్‌ని సప్లై చేసేందుకు అనుమతి ఇవ్వమని కోరింది. లేకుంటే తమకు ప్రొడక్షన్ కాస్టుని రీయింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేసింది. అలానే స్టాక్‌పాయింట్‌కు తాము అప్రోచ్ రోడ్డు వేశామని, దానిని కూడా రీయింబర్స్ చేయాలని కోరింది. ఇలానే మరికొన్ని గనుల లీజులు కాలం చెల్లిపోయింది. దీనిపై మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి కీలక నిర్ణయాన్ని తీసుకొన్నారు. ఒప్పందం సమయంలో పని చేయని కాలానికి పరిహారం చెల్లించడానికి ఎలాంటి అదనపు చెల్లింపు అవసరం లేకుండా సీనరేజ్ ఫీజు వసూలు కాంట్రాక్టుల గడువుని పొడిగించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

విజ్ఞాన్స్ యూనివర్సిటీని సందర్శించిన గానన్ యూనివర్సిటీ ప్రతినిధి

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీను యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సీ అగర్వాల్ మహేష్ సందర్శించారు. చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యతో



యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సీ అగర్వాల్ మహేష్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ మాట్లాడుతూ విద్యాపరిశోధన, బోధన తదితర అంశాల్లో రెండు యూనివర్సిటీలు కలిసి పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

10 వేల ఎకరాల భూ సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్లతో కలిపి రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇదికాకుండా బ్యాంకుల నుంచి, ఇతర ఆర్థిక సంస్థలు కలిపి మొత్తంగా మరో రూ.55 వేల కోట్ల వరకు నిధులు సమీకరిం చాలని భావిస్తోంది. మొత్తం లక్ష కోట్లతో అమరావతి నిర్మాణ పనులు చేస్తుంటే, సమాంతరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందకపోతే భవిష్య త్తులో సంక్షోభం చవిచూసే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రపంచ బ్యాంకు సూచించిన విధంగా అమరావతి నిర్మాణ పనులతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాల్సి వస్తోంది.

స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీతో అనేక ప్రయోజనాలు

అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ ప్రాజెక్టును కూడా ప్రభుత్వం ఎంచుకుంది. టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక నగరాన్ని స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ అంటారు. ఇందులోని పరిశ్రమలు డిజిటల్‌గా ఇంటిగ్రేట్ అయి ఉంటాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ద్వారా ఉత్పాదకతను పెంచడం, గ్రీన్ ఎనర్జీ అంటే సౌర, పవన శక్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలు ఉంటాయి. అలాగే, ఇవన్నీ కూడా రోడ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి అనుసంధానం (మల్టీమోడల్ కనెక్టివిటీ)గా ఉంటాయి. స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ వల్ల భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించవచ్చు. తద్వారా ఉద్యోగాల సృష్టి ఎక్కువగా జరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం ఇస్తుంది. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 2,500 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది.

అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతం పరిశీలన

ఈ మూడు ఎకనమిక్ బూస్ట్ ప్రాజెక్టులకు ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్యన భూములు సమీకరిస్తేనే సార్థకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మల్టీ మోడల్ కనెక్టివిటీ సాధించాలంటే.. ఈ ప్రాంతమే మంచిదని యోచిస్తోంది. అమరావతి నూతన రైల్వే లైను కూడా మంజూరైన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ రైల్వేలైన్ వెళ్తుంది.. దీనికోసం 800 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా అమరావతిలో వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ గ్రామాల్లో సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ ద్వారా ఇక్కడి భూము లను సమీకరించి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం భూములు ఎక్కడ తీసుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఏఏఐ అధికారులతో చర్చించాక కానీ ఓ స్పష్టత రాదు. ఎయిర్‌పోర్టు అవసరాల కోసం తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెద్దపరిమి, హరిశ్చంద్రపురం, తాడికొండ మండలంలోని మోతడక గ్రామాల్లో భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలనుకుంటున్నారు.

మరో 30 వేల ఎకరాలపై దృష్టి

అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాక రాజధాని విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలన్నది ప్రభుత్వ ఆలోచన. గవర్నమెంట్ కాంప్లెక్స్ పనుల్లో ఐకానిక్ టవర్లు మినహా మిగిలినవన్నీ రెండేళ్లలో పూర్తవుతాయి. మిగిలిన 30 వేల ఎకరాలను రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం, అనేక భాగస్వామ్య సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సమీకరించాలన్న ఆలోచన జరుగుతోంది. దేశంలోనే పేరెన్నికగన్న రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలను కూడా ఇప్పటికే ఆహ్వానించారు. ఇలాంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల న్నింటికీ అవసరమైన భూములను సమీకరించాలని, నిధులను కూడా సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.

రంగస్థల గౌరవం

- కళాకారులకు కందుకూరి రంగస్థల పురస్కారాలు
- రాష్ట్ర స్థాయిలో ముగ్గురి ఎంపిక
- అందులో ఇద్దరు ఉమ్మడి గుంటూరు వాసులు
- అందుకోనున్న రంగస్థల నటులు కందిమళ్ల, ఏవీ
- జిల్లాల వారీగా విశిష్ట పురస్కారం
- ప్రకటించిన ఏపీ ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్
- నేడు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రదానం

నరసరావుపేట కల్చరల్, తెనాలి అర్బన్, చిలకలూరిపేట, బాపట్ల ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పలువురు రంగస్థల కళాకారులకు సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం రంగస్థల ప్రతిష్టాత్మక, విశిష్ట పురస్కారాలు లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను మంగళవారం ప్రకటించారు. కందుకూరి 177 జయంతిని పురస్కరించుకుని.. 2025వ సంవత్సరానికి గాను రాష్ట్ర, జిల్లా స్థాయిలో వీటిని ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో ముగ్గురిని, జిల్లాల స్థాయిలో 107 మందిని ఎంపిక చేశారు. ఆరాధ్యుల వెంకటేశ్వరరావు(తెనాలి), డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు (చిలకలూరిపేట), డాక్టర్ గుర్రాల రవికృష్ణ(నంద్యాల) రాష్ట్రస్థాయి పురస్కారం ప్రదానం చేయనుంది. వీరికి రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తారు. జిల్లా స్థాయిలో విశిష్ట పురస్కారాన్ని పల్నాడు నుంచి షేక్.షఫీ ఉజ్మ, బెత్తినేని వెంకట లక్ష్మయ్య, దేవరపల్లి అన్నపూర్ణ, వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్ అందుకోనున్నారు. గుంటూరు జిల్లా నుంచి భూక్యా శ్రీనివాస నాయక్, ఏపూరి హరిబాబు, అయినాల మల్లేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, గాదె నాగభూషణం, పొగర్తి నాగేశ్వరరావు, గోపరాజు విజయ్, బి.నాగరాణి, అమృత వర్షిణి, గుడివాడ లహరి, సురభి ప్రభావతి, గుమ్మడి విమల కుమారి ఉన్నారు. బాపట్ల జిల్లా నుంచి లుక్కా సోమేష్, లింగంగుంట పద్మావతి, పోలూరు సుబ్బారావు పురస్కారం అందుకోనున్నారు. వీరికి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని.. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన..



కందిమళ్ళ సాంబశివరావు



ఆరాధ్యుల వెంకటేశ్వరరావు

పల్నాడు జిల్లా నుంచి విశిష్ట పురస్కారానికి ఎంపికైన...



షేక్ షఫీ ఉజ్మ



వంకాయలపాటి చెన్నకేశవ ప్రసాద్

తెలుగు నాటక రంగంపై కందిమళ్ల పరిశోధనలు

కందుకూరి రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన.. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ప్రముఖ నాటక రచయిత, రంగస్థల ప్రముఖుడు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు చిలకలూరిపేటలోని డీఆర్ఎన్ఎస్‌సీవీఎస్ కళాశాల నుంచి తెలుగు ప్రొఫెసర్ గా ఉద్యోగ విరమణ చేశారు. 'తెలుగు నాటక రంగం నూతన ధోరణులు, ప్రయోగాలు' అనే అంశంపై పీహెచ్‌డీ, 'గుంటూరు జిల్లా నాటక రంగ చరిత్ర' అనే అంశంపై డి లిట్ పట్టాలను నాగార్జున, బరంపురం విశ్వవిద్యాలయాల నుంచి ఆయన పొందారు. సారా సంహారం, సై సై జోడెడ్ల బండి వంటి 18 నాటకాలు నాటికలను రచించారు. ఉత్తమ నాటక రచయితగా నాగార్జున, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న, ప్రపంచ తెలుగు మహా సభల పురస్కారాలతో పాటు గిడుగు తెలుగు భాషా పురస్కారాలను అందుకున్నారు. కందిమళ్ల రచించిన అభినయ భారతాచార్య చాట్ల శ్రీరాములు, తెలుగు నాటకం ఉద్యమ నేపథ్యం నాటక గ్రంథాలకు ప్రభుత్వం నంది పురస్కారం ప్రదానం చేసింది.

పురాణ పాత్రల్లో మెప్పించిన ఏవీ సుబ్బారావు

రాష్ట్రస్థాయి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికైన వెంకటేశ్వరరావు ప్రముఖ రంగస్థల నటుడు ఏవీ సుబ్బారావు కుమారుడు. ఆయన 1972లో రంగస్థలంలో ప్రవేశించి శ్రీకృష్ణుడు, అర్జునుడు, శ్రీరాముడు పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు. నాలుగు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. 800కు పైగా సత్కారాలు పొందారు. పూర్ణశ్రీ నాట్య కళా సమితి స్థాపించి, చింతామణి నాటకంలో లవ్ సీన్, శ్రీకృష్ణ రాయబారంలో పడక సీను, గయోపాఖ్యానంలో వార్ సీన్ వంటి ఆడియో, వీడియో రికార్డులు, పలు బిరుదులు పొందారు. పలువురు ప్రముఖుల నుంచి అవార్డులు, సత్కారాలు అందుకున్నారు.

ఆకట్టుకున్న నా శత్రువు, అసత్యం నాటికలు



నా శత్రువు నాటికలో ఓ సన్నివేశం



అసత్యం నాటికలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎల్వీఆర్ అండ్ సన్స్ క్లబ్, కొరిటెపాడు వేదికగా నిర్వహిస్తున్న డాక్టర్ మాగంటి మురళీ మోహన్ నాటకోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రెండు నాటికలు ప్రదర్శించారు. తొలుత పీ బాలాజీ దర్శకత్వం వహించిన విశాఖప ట్నం వారి 'అ సత్యం' నాటిక కళాభిమానులను అలరించింది. అనంత రం యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి 'నా శత్రువు' నాటిక ఆకట్టుకుంది. సభా కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, కన్వీనర్ గుమ్మడి శ్రీమన్నారాయణ, కళా సమితి అధ్యక్షుడు కాట్రగడ్డ రామకృష్ణప్రసాదు జ్యోతి ప్రజ్వలన చేసి, వై.కే. నాగేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో పాల్గొన్న జి. మల్లికార్జునరావు, డీ. తిరుమలేశ్వరరావు, జానీబా షాల నిర్వహణలో అతిథులను కళాకారులను సత్కరించారు.

మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి

- రెండో విడత భూ సమీకరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- రూ. 42,360 కోట్ల పనులకు టెండర్లు పూర్తి
- పురపాలక శాఖ మంత్రి నారాయణ

తుళ్లూరు, (అనంతవరం) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. మంగళవారం రాజధాని గ్రామం అనంతవరంలో మంత్రి పర్యటించారు. గతంలో మైనింగ్ శాఖ సీఆర్డీఏకి కేటాయించిన గ్రావెల్ క్వారీలను మంత్రి పరిశీలించారు. రాజధాని పనులకు గ్రావెల్ ఇక్కడ నుంచి తీసుకోవచ్చా అనే దానిపై కొండ ప్రాంతంలో పర్యటించారు. అయితే ఇప్పటికే చాలా లోతుగా తవ్వి గ్రావెల్ వినియోగించటం వలన ఈ ప్రాంతంలో తీయటం కుదరదని మంత్రి స్పష్టం చేశారు. తవ్విన ల్యాండ్‌ని ఏ విధంగా ఉపయోగించాలనేది తెలుసుకోవటం కోసం వచ్చానని మంత్రి చెప్పారు. డ్రోన్ సహాయంతో పరిశీలించాల్సి ఉందన్నారు. రాజధాని పనులకు అవసరమైన గ్రావెల్ కోసం గుంటూరు, మాచర్ల ప్రాంతాలలో గనుల శాఖ 851 ఎకరాలు సీఆర్డీఏకి కేటాయించినట్టు చెప్పారు. అమరావతిలో రెండో విడత ల్యాండు పూలింగ్(భూ సమీకరణ)పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి నారాయణ మీడియాతో చెప్పారు. అమరావతిలో 5వేల ఎకరాలలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కట్టాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన అని మంత్రి అన్నారు. అందుకోసం భూసేకరణ బదులు పూలింగ్ (సమీకరణ)చేయాలని రైతులు కోరుతున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో రాజధాని అమరావతి పనులు ఆలస్యం అవుతున్నట్టు మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 93 వర్క్‌లకు గాను 68 వర్క్‌లకు రూ.42,360 కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు చేయటానికి కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అందుకు అవసరమైన కార్మికులను కంపెనీలు రంగంలోకి దింపినట్టు చెప్పారు. మంగళగిరి తాడేపల్లి, గుంటూరు, విజయవాడను కలిపి త్వరలో మెగా సిటీగా ఏర్పాటు చేయాలనే ఆలోచనతో సీఎం ఉన్నారన్నారు. అందుకే అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్టు చెప్పారు. ముప్పై వేల ఎకరాలు భూ సమీకరణ చేయాల్సి ఉందన్నారు. వీటిల్లో రైతులకు రిటర్నబుల్ పాట్లు ఇవ్వగా మిగిలిన భూముల్లో డ్రైన్‌లు , రోడ్లు ఇతర మౌలిక వసతుల కోసం మరికొన్ని వేల ఎకరాల అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఇంజనీరింగ్ అధికారులు, మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



అనంతవరంలో గ్రావెల్ క్వారీ ప్రాంతంలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

బంగారు కుటుంబాల వివరాలు సేకరణ





సంకుర నవీన్, బుర్రా చిన్నమ్మాయి కుటుంబ వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

తాడికొండ(పొన్నెకల్లు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు, పీ-4 కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న సీఎం నారా చంద్రబాబునాయుడు ఎస్సీ సామాజిక వర్గం ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో పీ-4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన కుటుంబాలలో మెకానిక్ సంకుర ప్రవీణ్, కార్పెంటర్ సంకుర నవీన్, బడ్డీకొట్టు నిర్వాహకురాలు బుర్రా చిన్నమ్మాయి, నిరుద్యోగి సరిగల నీలిమా తదితర కుటుంబాల సమస్యలు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. దీంతో మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ ఆదేశాల మేరకు తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి, పంచాయతీ కార్యదర్శి షేక్ జాన్‌లు వారి వారి కుటుంబాలకు వెళ్లి వివరాలను సేకరించారు. పీ-4 కుటుంబాల ఆర్థిక సామాజిక స్థితిగతులను విచారించి పూర్తి నివేదికలు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

18 నుంచి జాతీయస్థాయి
ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

వినుకొండటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 18వ తేదీ నుంచి జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. పోటీల్లో సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్, సేద్యపుసైజు, ఆరుపళ్లు, నాలుగు పళ్లు, రెండు పళ్ల విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాలకు ఈ నెల 18వ తేదీ లోపు కుంటా కోటిరెడ్డి 9440383545, మదాల చిరంజీవి 9490224445, రాధాకృష్ణ 9490920887 నంబర్లను సంప్రదించి ఎంట్రీలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సీనియర్ విభాగంలో 2వేల కేజీల బండరాయి పోటీల్లో మొదటి బహుమతి రూ.1.25 లక్షలు, 2వ బహుమతి రూ.లక్ష రూపాయలు, 3వ బహుమతి రూ.75వేలు.. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు బహుమతులను స్వయంగా ఇవ్వనున్నారని, అదేవిధంగా 4నుంచి 10వ బహుమతి వరకు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటకోటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

వినుకొండటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చేపలకు వెళ్లి విద్యుదాఘా తంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన ఏనుగుపాలెం సమీపంలోని కొంకేరు వాగు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలు... మండలంలోని ఉమ్మడివరం గ్రామానికి చెందిన ఉప్పలపాటి వెంకటకోటేశ్వర రావు (31) తో పాటు మరో వ్యక్తి చేపల కోసం గాలాలతో వెళ్లారు. చేతిలో ఉన్న గాలాలు పైనున్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తాకడంతో ప్రమాదానికి గురై వెంకట కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు. మృతునికి భార్య శిరీషాతో పాటు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు.

ఉమ్మడి జిల్లా కార్మిక శాఖలో బదిలీలు

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తు న్న సహాయ కార్మిక కమిషనర్లను బదిలీ చేస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు నగరంలో సహాయ కార్మిక కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న షేక్ సుభానీ నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రస్తుతం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సభ్యురాలుగా పనిచేస్తున్న దండ మూడి లక్ష్మికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. నరసరావుపేటలో సహాయ కార్మిక కమిషనర్‌గా పనిచేస్తున్న జీ ధనలక్ష్మి ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మంగళగిరిలో భవన నిర్మాణ సంక్షేమ బోర్డు సభ్యుడుగా పనిచేస్తున్న కట్టా శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

గుంటూరు(విద్య)ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో జిల్లా పరిషత్ యాజమాన్యాల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్‌కు గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కోసం తయారు చేసిన సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఈనెల 20లోగా తెలియజేయాలని డీఈవో సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్స్ deognt.blogspot.com అనే వెబ్‌సైట్ ద్వారా జాబితా పరిశీలించుకోవాలని, అభ్యంతరాలు నిర్దేశించిన తేదీలోగా అందజేయాలని సూచించారు. అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్స్ జాబితా సరిచూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పోలీసులు బెదిరిస్తున్నారని
రౌడీ షీటర్ ఆత్మహత్యాయత్నం

◆ ఆ ప్రచారంలో వాస్తవం లేదు : సీఐ బ్రహ్మయ్య

సత్తెనపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు వేధిస్తున్నారంటూ రౌడీ షీటర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. పలనాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ స్టేషన్ రైటర్ రవీంద్ర డబ్బులివ్వమని బెదిరిస్తున్నాడని, పాకాలపాడుకు చెందిన షేక్ ఖాశిం సైదా సోమవారం ఎలుకల మందు తిని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా ఖాశిం సైదా ఏరియా వైద్యశాల నుంచి విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో స్టేషన్ రైటర్ రవీంద్ర బాగా ఇబ్బంది పెడుతూ డబ్బులు కోసం డిమాండ్ చేస్తూ బెదిరిస్తున్నాడని, రవీంద్ర చెప్పినట్టు సీఐ చేస్తున్నారన్నారు. ఇప్పటికే రవీంద్ర తనను ఎస్సీ ఎస్టీ యాక్ట్ కేసులో ఇరికించాడని, తనను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, తనకు న్యాయం జరగక పోతే చనిపోతానంటూ వీడియోలో పేర్కొన్నాడు. ఖాశిం సైదా ఫిర్యాదుతో పట్టణ సీఐ బ్రహ్మయ్య ఏరియా వైద్యశాలకు వెళ్ళి ఖాశిం సైదాను విచారించారు. ఖాశిం సైదా ఆరోపణల్లో వాస్తవం లేదని, రౌడీ షీటరైన ఖాశిం సైదాను ఆదివారం కౌన్సెలింగ్ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు పిలిపించి పంపటం జరిగిందన్నారు. మద్యం తాగిన మైకంలో ఎలుకల పేస్ట్ తిన్నానని రౌడీ షీటర్ ఖాశిం సైదా పోలీసుల పై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆయన తెలిపారు. ఖాశిం సైదా వెనుక కొంత మంది వ్యక్తులు ఉండి అసత్య ప్రచారం చేయిస్తున్నారని, వారిని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సెలింగ్‌కు రాకుండా ఉండేందుకే కొంత మంది రౌడీ షీటర్లు ఈ విధంగా చేయించారన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా శ్రీనివాసరావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కే శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన తూర్పుగోదావరి జిల్లా ఏటిపాకలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు. డిప్యూటేషన్‌పై గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ప్రభుత్వం నియమించింది. రెండు మూడు రోజుల్లో ఈడీగా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని సిబ్బంది వెల్లడించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 515.20 అడుగులు ఉంది. ఇది 140.66 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,47,684 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,68,585 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,47,684 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 75,504 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు. 5	10000	12800
273	10000	12500
341	10500	13500
4884	10000	11400
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10000	12300
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	--	--
దేవనూరు డీలక్స్	10000	12400
ఆర్మూరు	9800	11000
తాలుకాయలు	4500	6500



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

సచివాలయ కార్యదర్శులు నిత్యం అందుబాటులో ఉండాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని వార్డు సచివాలయాల కార్యదర్శులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారి స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బ్రాడీపేట, కోబాల్ట్ పేట, లక్ష్మీపురం, ఎన్టీఆర్ స్టేడియం, ఏటి అగ్రహారం, చుట్టగుంట జంక్షన్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రజలతో మాట్లాడి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ తొలుత ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌తో మాట్లాడగా, వారు స్థానికంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి కుక్కల సమస్యలపై తమ దృష్టికి తెచ్చారని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్టేడియంలో వాకింగ్ ట్రాక్ మరమ్మతుల ఫైల్‌ని అక్కడే ఓకే చేసి, త్వరగా పనులు ప్రారంభించాలని డీఈఈని ఆదేశించారు. త్రాగునీటి కోసం ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కంకర గుంట ఆర్‌యూబీ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి వేగంగా చేపట్టాలన్నారు. చుట్టగుంట జంక్షన్‌లో అవుట్ ఫాల్ డ్రెయిన్ విస్తరణ చేపట్టడానికి పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. చుట్టగుంట జంక్షన్ వద్ద గల అన్న క్యాంటీన్‌ని పరిశీలించి ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, మధుసూదన్, ఏసీపీ రెహ్మాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అవయవ దానాలపై మరింత అవగాహన అవసరం

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కళ్ళు, అవయవ, దేహ దానాలపై అవగాహన మరింత అవసరమని రాష్ట్ర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకుడు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అన్నారు. ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో నేత్ర, అవయవ, దేహదానాల ప్రాధాన్యతపై వల్లూరు సదాశివరావు ప్రచురించిన నాలుగు పేజీల కరపత్రాన్ని మంగళవారం స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐదు లక్షల మంది కిడ్నీ అవసరాల బాధితులు ఉంటే కేవలం 50 వేల వరకు లభించే అవకాశాలు ఉండటం విచారకరమని చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ టిసేవా కుమార్ మాట్లాడుతూ నేత్ర, అవయవ, దేహదానాలపై ప్రజల్లో ఇప్పుడిప్పుడే చైతన్యం పెరుగుతున్నదని ప్రభుత్వాలు కూడా తగినంతగా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమానికి ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపకులు మేదూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా జన విజ్ఞాన వేదిక నాయకులు వెంకట్రావు, రవీంద్ర బాబు, రమణ బాబు, ఎస్ఎస్‌వి ప్రసాద్‌రావు, నాంచారయ్య పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రమణ యశస్వి, పాల్గొన్న ప్రజా ఆలోచన వేదిక సభ్యులు

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకై దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో మే 1 నుంచి 31 తేదీ వరకు జరిగే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకై క్రీడా అసోసియేషన్లు, పీఈటీలు, కోచ్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎస్‌డీవో పి.నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను ఈ నెల 17వ తేదీలోపు బీఆర్ స్టేడియం, క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

స్థలం కబ్జా చేస్తున్నారని ఆందోళన

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : తమ స్థలాన్ని ఓ మాజీ మంత్రి బంధువులు కబ్జా చేస్తున్నారంటూ నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో బాధితులు మంగళవారం స్థలం వద్ద భైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. తాము 598 గజాల స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నామన్నారు. కొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి ఎలాగైనా మా స్థలం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికే తమపై తప్పుడు కేసులు కూడా పెట్టించారన్నారు. తమకు న్యాయం చేయాలని బాధితుడు ఏడుకొండలు కుటుంబం స్థలం వద్ద భైఠాయించారు. విషయం తెలుసుకున్న నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వారిని అక్కడ నుంచి పంపించి వేసారు.

భర్త, అత్తింటి వారిపై కేసు నమోదు

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ 6వ లైనుకి చెందిన నల్లపురెడ్డి పద్మజకు, మనోహర్‌రెడ్డికి 2007లో వివాహం జరిగింది. వారికి ఒక పాప, ఒక బాబు సంతానం ఉన్నారు. భర్త ఏ పని చేయకుండా మద్యానికి బానిసై, రోజూ తాగి వచ్చి ఆమెని కొట్టి హింసిస్తున్నట్లు, అదనపు కట్నం కోసం ఆమె భర్త, అత్త, మరిది, ఆడపడుచు కలిసి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం

● ట్రాఫిక్ మళ్లింపు, స్థల సేకరణ, నాణ్యతలో అప్రమత్తంగా ఉండాలి

● అధికారులతో గుంటూరు ఎమ్మెల్యేలు నసీర్, మాధవి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రజల మూడు దశాబ్దాల కలైన శంకర విలాస్ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి చెప్పారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆర్ అండ్ బీ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ ఇతర అధికారులతో మంగళవారం వారిరువురూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కృషితో బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్రిడ్జి పనుల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, ట్రాఫిక్ మళ్లింపు, స్థల సేకరణ వంటి అంశాలపై అధికారులు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతపై రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.



శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ ప్రక్రియను ఎమ్మెల్యేలకు వివరిస్తున్న అధికారులు



విద్యాశాఖ మంత్రి లోకేశ్ నుంచి పురస్కారం అందుకుంటున్న రాజేశ్వరి

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు పురస్కారం

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్.రాజేశ్వరి రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన ప్రతిభా పురస్కారాల్లో మంత్రి లోకేశ్ నుంచి విద్యార్థిని అవార్డు అందుకున్నారు. ఇంటర్ ఎంఈసీలో 967 మార్కులు సాధించడంతో జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా నిలిచారు. ఈ నేపథ్యంలో విద్యార్థినికి మంత్రి లోకేశ్ ల్యాప్‌టాప్, నగదు, ప్రతిభ పురస్కార సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత అధ్యాపకులు తదితరులు అభినందించారు.

జూన్ 30 వరకు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు అవకాశం

● లేకుంటే తనిఖీల్లో పూర్తి ఛార్జీలతో నోటీసులు

● గుంటూరు సర్కిల్ ఎస్‌ఏవో రామిరెడ్డి



ఎస్‌ఏవో రామిరెడ్డి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మీటర్‌ల అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ శాఖ గృహ వినియోగదారులకు జూన్ 30 వరకు సదావకాశాన్ని అందించినట్లు గుంటూరు సర్కిల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎస్‌ఏవో) పాశం రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులకు లోడ్ క్రమబద్ధీకరించుకునేందుకు ప్రత్యేక రాయితీ ప్రకటించినట్లు చెప్పారు. ప్రస్తుతం కిలో వాట్‌కు రూ.2200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. కానీ స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారి కోసం రాయితీ కింద కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.1000, సెక్యూరిటి డిపాజిట్ కింద రూ.200 చెల్లిస్తే సరిపోతుందన్నారు. అలానే 2 కిలో వాట్స్‌కు రూ.4400ల బదులుగా రూ.2400 చెల్లిస్తే సరిపోతుందన్నారు. 4 కిలో వాట్స్ అదనపు లోడ్‌కు రూ.4800 చెల్లిస్తే సరిపోతుందన్నారు. గుంటూరు సర్కిల్ పరిధిలోని తెనాలి, గుంటూరు డివిజన్‌లో ఉన్న 6, 12, 294 మంది గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ కార్యాలయాల్లోని అన్ని రెవెన్యూ కౌంటర్లు, మీ సేవా సెంటర్‌లు, ఏపీ సీపీడీసీఎల్ వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకొని అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని ఎస్‌ఏవో రామిరెడ్డి కోరారు. లేనిచో విద్యుత్‌శాఖ అధికారులు తనిఖీలకు వచ్చి అదనపు లోడ్ వినియోగించుకున్న గృహ విద్యుత్ వినియోగదారులకు పూర్తి చార్జీలను నోటీసు రూపంలో అందజేస్తారన్నారు. అప్పుడు పూర్తి చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై దశల వారీ పోరాటాలకు సిద్ధం కావాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు ఉపసంహరించే వరకు దశల వారీ పోరాటాలకు సమాయత్తం కావాలని రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చింది. వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, మైనార్టీ, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ముస్లిం సమాజానికి పూర్తి వ్యతిరేకంగా ఈ సవరణ చేయబడిందని, ఆ సమాజానికి నష్టం కలిగించే అనేక అంశాలు ఈ చట్టంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు జియావుర్ రెహమాన్, కే.నళినికాంత్, బిళ్లా సునీల్, బషీర్ అహ్మద్, వెంకటేశ్వరరావు, టి.నాగేశ్వరరావు, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఖాజావలి, చిష్టీ, సీనియర్ న్యాయవాది వైకే, గుర్రంకొండ సత్యానందం పాల్గొని ప్రసంగించారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంగళవారం కారుణ్య నియామకాల ప్రక్రియ ద్వారా అర్హులైన ముగ్గురు అభ్యర్థులకు ఆఫీసు సబర్డినేట్‌గా నియామక ఉత్తర్వులు అందజేశారు. మొహమ్మద్ యునస్‌ను కర్లపాలెం ఎంపీపీ కార్యాలయంలో, కాకుమాను వినయ్‌ను చుండూరు కార్యాలయంలో, ఎం.నంద కిషోర్ నాయక్‌ను కొల్లిపర ఎంపీపీ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌లుగా నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ క్రిస్టినా మాట్లాడుతూ నూతన సంవత్సరం ఒక మంచి పనితో ప్రారంభించడం చాలా ఆనందంగా వుందన్నారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూల్ పాల్, ఎ సెక్షన్ ఏవో రాజా రత్నబాబు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల రాష్ట్ర నేత ఇంట్లో చోరీ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తారకరామనగర్ ఆరోవ లైన్‌లో దొంగలు రెచ్చిపోయారు. తెలుగు నాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మలినేని భానుమూర్తి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గత వారంలో భానుమూర్తి కుటుంబంతో సహా నెల్లూరు వెళ్లారు. ఆ సమయంలో ఇంటి బయట ఉన్న ముఖ్యమైన వస్తువులను, బాత్ రూంలో ఉన్న గ్రీజర్లు, ట్యాపులు ఇతర విలువైన వస్తువులను దొంగలు తీసుకొని వెళ్లారు. మంగళవారం ఊరిలోకి వచ్చిన కుటుంబ సభ్యులు దొంగతనం జరిగిన సంగతిని గుర్తించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సమాజాన్ని తట్టి లేపేది కవిత్వం : భూసురపల్లి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని తట్టి లేపేది కవిత్వమని సంగీత సాహిత్య ప్రముఖులు భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా రచయితల సంఘం ప్రతినెలా నిర్వహిస్తున్న కవిత్వంతో కాసేపు కార్యక్రమాన్ని ఈ నెల సంఘం ఉపాధ్యక్షులు షేక్ కాశింబి స్వగృహంలో నిర్వహించామని సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్ ఎం సుభాని తెలిపారు. అనంతరం పాల్గొన్న కవులందరూ తమ స్వీయ కవితతో పాటు తమకు నచ్చిన సమకాలీన కవుల కవితను చదివి వినిపించారు. కార్యక్రమంలో కవులు తాటికోల పద్మావతి, చుండూరు శేషమాంబ, పింగళి భాగ్యలక్ష్మి, నానా, శ్రీ వశిష్ఠ సోమేపల్లి, పి.బలరాం, మెట్టు శ్రీనివాసరెడ్డి, సి.సురేష్, గిరి భూషణరావు పాల్గొన్నారు.

కిల్కారి సేవలను గర్భిణులు వినియోగించుకోవాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిల్కారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం మీటింగ్ హాల్‌లో మంగళవారం జరిగిన నోడల్ ఆఫీసర్ల సమావేశంలో ఆమె ప్రసంగించారు. గర్భిణీకి నాల్గవ నెల నుంచి బిడ్డకు ఒక ఏడాది వచ్చే వరకు కిల్కారి ఫోన్స్ కాల్స్ వస్తాయని డాక్టర్ విజయలక్ష్మి వివరించారు. వాయిస్ కాల్స్ వచ్చే వారికి తల్లి బిడ్డల ఆరోగ్య సమాచారం అందజేస్తుందని ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660 అని, గర్భిణీ మొబైల్ ఫోన్‌లో ఈ నెంబర్ సేవ్ చేసుకోవాలని ఆమె సూచించారు. కాల్ వచ్చినప్పుడు రిసీవ్ చేసుకొని పూర్తి సమాచారం వినవచ్చన్నారు. ఒకవేళ మరలా ఆ సమాచారం వినాలంటే 14423అనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు రింగ్ చేసి వినవచ్చని డీఎంహెచ్‌వో తెలిపారు. జిల్లాలో కిల్కారిలో చక్కగా పనిచేసిన ఆశలకు డీఎంహెచ్‌వో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, పీవో ఎన్‌సీడీ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డీపీహెచ్‌ఎన్‌వో డాక్టర్ ప్రియాంక, హెచ్‌ఈఈవో చంద్రశేఖర్, కిల్కారి రాష్ట్ర ప్రోగ్రామింగ్ మేనేజర్ ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.




ఉత్తమ ఆశాకు బహుమతి అందజేస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సాహిస్తే వారు అన్ని రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్షా విభాగం ఆధ్వర్యంలో బ్రాడీపేట శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించిన 'ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఉచిత ఉపకరణాల పంపిణీ' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, పిల్లలకు పరికరాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు శిబిరాలు ఏర్పాటు చేసి పాఠశాలల్లో చదివే విద్యార్థులనే కాక, బయట ఉండే వారిని గుర్తించి వారికి కూడా వివిధ పరికరాలను పంపిణీ చేశామని తెలిపారు. ప్రధానంగా బ్యాటరీతో పనిచేసే మోటరైజ్డ్ ట్రై సైకిల్ విత్ బాక్స్ - 11, ట్రై సైకిళ్ళు -8, సీపీ వీల్ చైర్లు- 32, వినికిడి యంత్రాలు -43, టీఎల్ఎం(కిట్స్)- 66, రోలేటర్స్- 14, బ్రెయిలీ కిట్స్- 21, విజువల్ ఇంపెయిర్మేంట్ కిట్- 1, వీల్ చైర్స్- 62 పంపిణీ చేశామన్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఏ అవసరం వచ్చినా తనని సంప్రదించాలని, అండగా నిలబడతానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీనిచ్చారు. కార్యక్రమంలో డీఈవో సీవీ రేణుక, ఈరంటి వర ప్రసాద్, షేక్ హుస్సేన్, రఘు మాస్టర్, దామచర్ల శ్రీనివాస్, కట్టా కాళిదాసు, ఎంఈఓ వెంకట రమణయ్య, సమగ్ర శిక్ష శ్రీనివాసరావు, నాగేంద్రమ్మ, సీఎంఓ అనిల్, గడ్డం శ్రీనివాస్, కొత్తకోటి ప్రసాద్, మంగాకోటి, ఆళ్ళ హరి, మొవ్వా వేణు, నంది సరస్వతి, లంకా మాధవి, శివజ్యోతి, నల్లబోయిన అనితా, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.



ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి

నూతన భవన సముదాయానికి విరాళం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న నూతన భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షల విరాళాన్ని భారత వ్యవసాయ పరిశోధన సంస్థ, న్యూఢిల్లీలో పని చేసిన విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ అంచా ప్రమీలదేవి, విశ్రాంత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అంచా అయ్యేశ్వరరావు ప్రకటించారు. ఈ విరాళాన్ని కుందుల రోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు చెక్కును అందజేశారు. దాతలు మాట్లాడుతూ విరాళంతో పాటు చదువుపై దృష్టి పెట్టేలా వసతి గృహ విద్యార్థినులకు ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తామని అన్నారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా వసతి గృహాన్ని నిర్మిస్తామని అన్నారు. కార్యక్రమంలో వసతి గృహ ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సభ్యులు గోరంట్ల పున్నయ్య చౌదరి, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు, వంకాయలపాటి బలరామకృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో భాగంగా నివాసాలు కూల్చివేత

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగు రోడ్డు మూడో దశ పనుల్లో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు నివాసాలు కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్వర్ణభారతీ నగర్‌లోని మిషన్ ఫారమ్ వద్ద రేకుల షెడ్డులను కూల్చివేసే సమయంలో చిన్నపాటి ఉద్రిక్తత నెలకొంది. ప్రత్యామ్నాయం చూపించకుండా నివాసాలు కూల్చి వేయవద్దని స్థానికులు నిరసనకు దిగారు. గతంలో ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయిస్తామని అధికారులు, ఎమ్మెల్యే హామీ ఇచ్చారని, ఇప్పుడు అవి లేకుండా కూల్చివేయడం సరికాదన్నారు. దీనిపై కలెక్టర్‌ను, ఎమ్మెల్యేను కలుస్తామని స్పష్టం చేశారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : బొంగరాలబీడు 4వ లైనుకి చెందిన కొమ్మతోటి కల్పన(19) అదృశ్యమైంది. ఆమె ఓ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఈ నెల 15న ఉదయం 8 గంటల సమయంలో ఎంసెట్ కోచింగ్ నిమిత్తం అమరావతి రోడ్డులోని ఓ కాలేజీ వద్దకి వెళ్ళి అక్కడి నుంచి ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె తల్లి భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అరండల్‌పేట పోలీసులు తెలిపారు.

కళాకారులను ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కళాకారులను, సామాజిక సేవలను చేస్తున్న వారిని ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాదు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, గెట్ టు గెదర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ కళారత్న (హంస) అవార్డు అందుకున్న ప్రముఖులకు సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సామాజిక సేవల్లో ఉన్నవారు పీ 4లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే కళాకారులకు ఉగాది పురస్కారాలు అందించామని గుర్తుచేశారు. సీనియర్ కళాకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. అనంతరం పారిశ్రామికవేత్త కొత్త సుబ్రమణ్యం, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, సంస్థ అధ్యక్షుడు మన్నె సుబ్బారావు, కోగంటి బసవనందికేశ్వరరావుతో కలసి అవార్డు గ్రహీతలు ఆలయ కమిటి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యంలను ఆయన ఘనంగా సత్కరించారు.

టీటీడీ గోశాలపై భూమన అసత్య ప్రచారం

● ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రభాకర్



గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీపై భూమన కరుణాకరరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ మండిపడ్డారు. టీడీపీ నగర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నేతలు మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు, ప్రశాంతతకు భంగం కలిగించేందుకు టీటీడీపై వైసీపీ రోజుకో తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. గోశాలలో 100 ఆవులు చనిపోయాయంటూ నేడు కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తి అవాస్తవమన్నారు. కరుణాకరరెడ్డి ప్రెస్‌మీట్‌లో చనిపోయినట్లు చూపించిన ఆవుల ఫొటోలు టీటీడీలోవి కాదని, అవి ఎక్కడివోనని, వాటిని అడ్డుపెట్టుకుని టీటీడీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని డేగల ఆగ్రహం వ్యక్తం చేశారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్నందుకు, టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేస్తున్నందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 142 మందికి రూ. 8.52 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ విజిలెన్స్ ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విజిలెన్స్ (డీపీఈ) ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, గుంటూరు టౌన్ -1 ఈఈ టి.శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో నగరంలోని డి 5 సెక్షన్‌పరిధిలో ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, పాతగుంటూరు, బాలాజీనగర్, సుద్దపల్లి డొంక, ప్రగతినగర్ ప్రాంతాల్లో మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 59 మంది అధికారులు, 180 మంది సిబ్బంది 59 బృందాలుగా ఏర్పడి 5052 సర్వీసులు తనిఖీలు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీల్లో అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, ఇతర కేటగిరీల్లో, అదనపు లోడ్‌తో వినియోగించటంపై 142 మందికి రూ.8.52 లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్‌చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకునేందుకు విద్యుత్ శాఖ ప్రకటించి 50 శాతం రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ దాడుల్లో డీఈఈలు కే.రవికుమార్, ఎన్.మల్లికార్జునప్రసాద్, హుస్సేన్‌ఖాన్, ఏఈలు కోటేశ్వరరావు, చంద్రశేఖర్, ఎం.సతీష్‌కుమార్, శివశంకర్, మస్తాన్‌వలి తదితరులున్నారు.

ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్న పోలీసులు

● అంకాలజిస్టు డాక్టర్ రాజునాయుడు

గుంటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : అహర్నిశలు ప్రజా శ్రేయస్సు కోసం కృషి చేస్తూ ప్రజల రక్షణ, భద్రతలో తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని ఆర్కా హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రస్తుత డైరెక్టర్, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ డీఎస్ రాజు నాయుడు తెలిపారు. పోలీస్ కళ్యాణ మండపంలో ఆర్కా ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. తొలుత వైద్య శిబిరాన్ని ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు ప్రారంభించి మాట్లాడుతూఆర్కా హాస్పిటల్ మరియు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ యాజమాన్యానికి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తరపున, గుంటూరు జిల్లా పోలీస్ విభాగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 146 మంది పోలీసులు, వారి కుటుంబ సభ్యులు హాజరై ఉచిత వైద్య సహాయాన్ని పొందారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆర్కా హాస్పిటల్ నుండి డాక్టర్ రాజు నాయుడు, డాక్టర్ పవన్ రాఘవరెడ్డి, డాక్టర్ హేమంత్ మాకినేని, డాక్టర్ హిమని మంచాల, ఉదయ్ హాస్పిటల్ నుండి డా. శ్రీనివాసరావు , డాక్టర్ విశాలాక్షి తోట, కృష్ణ నర్సింగ్ హోమ్ నుండి డాక్టర్ పెద్ది నవీన్ కృష్ణ , ఆర్ఐలు రామకృష్ణారెడ్డి, శివరామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో.. చిన్నారులు జాగ్రత్త

కార్ డోర్ లాక్‌లపై ఏమరపాటు వద్దు

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం దృష్ట్యా ఇప్పటికే పాఠశాలల్లో ఒంటి పూట తరగతులు కొనసాగుతున్నాయి. దీంతో మధ్యాహ్నమే పిల్లల్లు ఇళ్లకు వచ్చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే వేసవి సెలవులు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో పది నుంచి 12 ఏళ్ల వయస్సు లోపు పిల్లలు ఎక్కువగా ఆటలాడుకుంటుంటారు. వాహనాల లోపలికి చేరి ఆడుకోవడంపై ఎక్కువగా ఇష్టపడుతుంటారు. చాలామంది వాహన యజమానులు అపార్టుమెంట్స్ సెల్లార్లు, ఇండిపెండెంట్ గృహాల్లోని కారిడార్లు, ఇళ్ల ముందు కార్లు పార్కింగ్ చేసి డోర్లు సక్రమంగా లాక్ అయ్యాయో, లేదో చూడకుండా లోపలికి వెళ్లిపోతుంటారు. పొరపాటున డోర్ లాక్ కాకపోతే పిల్లలు వాటిని తెరిచి లోపలికి వెళ్లి ఆడుకుంటుంటారు. ఆ సమయంలో కనక డోర్ లాక్ అయి ఎవరూ చూడకపోతే కాసేపటికే లోపల ఉన్న పిల్లలు ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరికి గురై నిండు ప్రాణాలు కోల్పోతుంటారు. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు కొద్ది రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవడం ఆ తర్వాత షరామామూలుగా నిర్లక్ష్యం వహించడం వాహన యజమానులు/డ్రైవర్లకు పరిపాటైపోయింది. తాజాగా తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో ఇలాంటి సంఘటనే సోమవారం జరగడం ప్రతీ ఒక్కరి హృదయాలను కలిచి వేసింది.

గతంలో కార్లకు మాన్యువల్ లాక్‌లు ఉండేవి. దాని వలన కారుని పార్కింగ్ చేయగానే తప్పక తాళం వేసేవారు. తాళం వేసిన తర్వాత సక్రమంగా లాక్ అయిందో, లేదో బటన్ ప్రెస్ చేసి చూసుకొనేవారు. అలానే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సైడు అద్దాలను కొంచెం తెరచి ఉంచేవారు. అయితే టెక్నాలజీ మారడం, హైఎండ్ కార్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఆటోమేటిక్ డోర్ లాక్ సిస్టమ్స్ అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సందర్భాలలో కారు డోర్లు లాక్ అయ్యాయి కదా అని కీ డోర్ క్లోజ్ బటన్ నొక్కడం మరిచిపోతున్నారు. కారు పార్కింగ్ చేసిన తర్వాత కొద్ది దూరం నుంచి కీ బటన్ ప్రెస్



చేస్తున్నారు. అలారం సౌండ్ రాగానే డోర్లు లాక్ అయ్యాయని భావిస్తున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో అవి లాక్ కావడం లేదు. పిల్లలు వెళ్లి డోర్ లాగగానే అది తెరుచుకొంటున్నది. వాళ్ల లోపలికి వెళ్లాక అది మూతబడుతున్నది. అన్ని డోర్లు మూసి ఉండటం వలన లోపల గాలి ప్రసరణ లేక అందులో ఉన్న పిల్లలకు ఊపిరి ఆడక విలవిల కొట్టుకొంటున్నారు. బయట చల్లగా ఉన్నా కారు లోపల వాతావరణం ఉష్ణంగా ఉంటుంది. దీనికి పిల్లల శరీరం తట్టుకోలేక గుండెపోటుకు దారి తీస్తుంది.

లాక్ చేసినా...

కొంతమంది కారు యజమానులు వాహనానికి పకడ్బందీగానే లాక్ చేస్తున్నారు. అయితే ఇంట్లోకి వెళ్లిన తర్వాత తాళాన్ని పిల్లలకు అందే ప్రదేశంలో పెడుతున్నారు. దాంతో పిల్లలు ఆ తాళాన్ని తీసుకొని కారు వద్దకు వెళ్లి ఓపెన్ లాక్ బటన్ నొక్కుతున్నారు. డోరు తెరుచుకోగానే లోపలికి వెళ్లి క్లోజ్ చేస్తున్నారు. ఆ తర్వాత దానిని ఓపెన్ చేయడం వాళ్లకు తెలియడం లేదు. ఇది కూడా ప్రమాదానికి దారి తీస్తున్నది.

ఇలా చేయండి...

కారు యజమానులు పార్కింగ్ చేసిన తర్వాత లాక్ చేసి ఒకటికి రెండు సార్లు డోర్లు సక్రమంగా మూసుకొన్నాయో, లేదో పరిశీలించాలి. అలానే కారు తాళాలను ఎల్లప్పుడూ పిల్లలకు అందకుండా ఎత్తయిన ప్రదేశంలో ఉంచాలి. పిల్లలను ఇంటి ఆవరణలో ఆడుకునేటప్పుడు వాళ్ల వద్ద పెద్దవాళ్లలో ఎవరో ఒకరు ఉండటం మంచిది. కారు డోర్ లాక్‌లే కాకుండా ఏ ప్రమాదం వచ్చినా కాపాడేందుకు వీలుంటుంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఐరన్ గేట్లను అటు ఇటు నెడుతూ వాటిని మీద పడేసుకొంటుంటారు. అలానే వీధికుక్కలు దాడి చేసే అవకాశం ఉంటుంది. అపరిచితులు కిడ్నాప్‌లు వంటి చర్యలకు కూడా పాల్పడవచ్చు. అలానే కరెంట్ కనెక్షన్లు ఉన్న చోటికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. వీటన్నింటి దృష్ట్యా పిల్లలకు కాపలాగా పెద్దవాళ్లలో ఒకరు ఉంటే మంచిది.

నాటక రంగానికి ఊపిరి పరిషత్‌లు

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య
- ముగిసిన కొండవీటి కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు
- ఉత్తమ ప్రదర్శనగా 'అసత్యం'

లింగారావుపాలెం(యడ్లపాడు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : నాటకం అంతరించి పోకుండా కళాకారులను, నాటక సమాజాలను ప్రోత్సహిస్తూ ఊపిరి పోస్తున్నవి కళాపరిషత్‌లేనని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. కొండవీటి కళాపరిషత్ 26వ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. గ్రామంలోని పోసాని సుబ్బారావు చౌదరి స్మారక కళావేదికపై మూడు రోజులపాటు రోజుకు మూడు చొప్పున తొమ్మి ది నాటికలు ప్రదర్శితమయ్యాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి లావు రత్తయ్య ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తూ కళామతల్లికి సేవలందిస్తున్న కొండవీటి కళాపరిషత్ నిర్వాహకులు ఎంతైనా అభినందనీయులన్నారు. దీర్ఘకాలం పరిషత్‌ల మనుగడ సాగించేందుకు నిర్వహణ వ్యయాలను రాబట్టుకునే మార్గాలను వెతకాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించి వాటి ద్వారా వనరులను సమకూర్చుకుంటే దీర్ఘకాలం పరిషత్‌లను నిర్వహించేందుకు వీలుకలుగుతుందని సూచించారు. పరిషత్ ఉపాధ్యక్షులు తోకల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు గుదె పాడు రంగారావు, పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, గుంటూరు కళాపరిషత్ గౌరవాధ్యక్షులు ఆలోకం పెదబ్బయ్య, కొండవీటి కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



అసత్యం నాటిక బృందానికి ప్రథమ బహుమతిని అందజేస్తున్న లావు రత్తయ్య, నిర్వాహకులు

మూడు రోజులు.. 9 ప్రదర్శనలు

మూడు రోజులపాటు 9 నాటకలు ప్రదర్శించగా వాటిలో ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి, విశాఖ వారి 'అసత్యం' నాటిక నిలిచి ప్రథమ బహుమతి సొంతం చేసుకుంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా యంగ్ థియేటర్ ఆర్ట్స్, విజయవాడ వారి '27వ మైలురాయి', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి 'జనరల్ బోగీలు' నాటికలు బహుమతులు అందుకున్నాయి. ప్రత్యేక జ్యూరీ బహుమతిని యువభేరి థియేటర్స్, హైదరాబాద్‌వారి 'నా శత్రువు' నాటిక అందుకుంది. ఆయా నాటికలకు వరుసగా రూ.20వేలు, రూ.19వేలు, రూ.18వేలు, రూ.17వేలు, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రతి నాటికకు ప్రదర్శనా పారితోషికం రూ.15వేలు, జ్ఞాపికను అందించారు. ఇవికాక ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకులకు నగదు పారితోషికంతోపాటు, జ్ఞాపికలను అందించారు.

వ్యక్తిగత విభాగంలో బహుమతుల వివరాలు

ఉత్తమ రచయిత పీటీ మాధవ్(27వ మైలురాయి), ఉత్తమ దర్శకుడు బాలాజీ నాయక్(అసత్యం), ఉత్తమనటుడు పవన్ (27వ మైలురాయి), ఉత్తమ నటి సురభి ప్రభావతి(27వ మైలురాయి), ఉత్తమ ప్రతినాయకుడు గోపురాజు విజయ్(జనరల్ బోగీలు), ఉత్తమ హాస్యనటన జ్యోతిరాణి(నా శత్రువు), ఉత్తమ రంగాలంకరణ ఎం సత్తిబాబు(అసత్యం), ఉత్తమ సంగీతం లీలామోహన్(27వ మైలురాయి)కి లభించాయి. ఇవికాక ఉత్తమ క్యారెక్టర్, ఉత్తమ సహాయ నటీనటుల విభాగాలలో కూడా బహుమతులు అందజేశారు. 5గురికి ప్రత్యేక జ్యూరీ బహుమతులు అందించారు.

నేడు దర్గా స్వాధీనం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎత్తురోడ్డులోని మస్తాన్ బాబా దర్గాను బుధవారం ఉదయం స్వాధీనం చేసుకుంటున్నామని జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. వాస్తవానికి మంగళవారమే స్వాధీనం చేస్తామని చెప్పామని, ఉన్నతాధికారులు అనుమతి ఆలస్యమ వడంతో నేటికి వాయిదా వేశామని అన్నారు. దర్గాకు వచ్చే కానుకుల్లో ఏడు శాతం వక్ఫ్ బోర్డుకు చెల్లించకపోవడంతో దర్గా స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. స్వాధీనం చేస్తున్నామని ధర్మకర్తలకు 9న నోటీసులు పంపామని తెలిపారు.



శ్రీ హజరత్ కాలే మస్తాన్‌వలీ ఆవులియా దర్గా

దర్గా... వక్ఫ్ పరిధిలో లేదు

స్థానిక ఎత్తురోడ్డులోని మస్తాన్ బాబా దర్గా వక్ఫ్ పరిధిలో లేదని ఆ దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు స్పష్టం చేశారు. దర్గా ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్ పరిధిలో దర్గా లేదని 2000 సంవత్సరంలో జిల్లా కోర్టు వక్ఫ్ పరిధిలో దర్గా లేదని తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలియక 2000 ముందు వరకు ఒక వక్ఫ్ బోర్డుకు పన్నులు చెల్లించామని అన్నారు. తిరిగి ఇప్పుడు దర్గాకు వచ్చే కానుకల్లో ఏడు శాతం చెల్లించడం లేదని అందుకే దర్గాను 11న స్వాధీనం చేసుకుంటున్నామని వక్ఫ్ అధికారులు ఈనెల 9న నోటీసులు పంపారని చెప్పారు. 14 వరకు గడువు ఇవ్వాలని అధికారులను కోరానని చెప్పారు. అధికారులు పంపిన ప్రతి నోటీసులకు సమాధానం చెబుతున్నానని తెలిపారు.

ప్రతికూల పరిస్థితులను అధిగమించాలి

● గుంటూరు రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సమయంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కూడా అలాంటి పరిస్థితిని ఎదుర్కొని గొప్ప నాయకుడిగా ఎదిగారని రైల్వే గుంటూరు డీఆర్ఎం సుధేష్ణ సేన్ అన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో అంబేద్కర్ 134వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతీ ఒక్కరూ టీం స్పిరిట్‌ని కొనసాగించాలని రైల్వే అధికారులకు సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే సైమన్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



రైల్ వికాస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

టమాట ధరలపై అప్రమత్తం



- గత పదేళ్లలో ఏటా మే, జూన్, జూలైలోనే పెరుగుదల
- ఈ ఏడాది ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉంచాలి
- జిల్లా మార్కెటింగ్ అధికారులకు ప్రభుత్వం ఆదేశం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టమాట ధరలు ఇప్పుడు తక్కువగా ఉన్నాయని విశ్రమించొద్దని మార్కెటింగ్ జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. గత పదేళ్లలో చూసుకొంటే ప్రతీ సంవత్సరం మే, జూన్, జూలై నెలల్లో ధర విపరీతంగా పెరుగుతున్నది. కొన్ని సందర్భాలలో కేజీ రూ. 100 దాటిన పరిస్థి తులున్నాయి. ఆ పరిస్థితుల్లో టమాటల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటం చూస్తూ వస్తున్నాం. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు జిల్లాలో ఎక్కడా తలెత్తకుండా చూడాలి. టమాటలు పండించిన రైతులే నేరుగా రైతుబజార్లకు వచ్చి విక్రయించాలి. అప్పుడే దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట పడి ధర పెరగకుండా ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మార్కెటింగ్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

టమాటాలు జిల్లాకు ఎక్కువగా బెంగళూరు, మదనపల్లె మార్కెట్‌ల నుంచి దిగుమతి జరుగుతుంటాయి. స్థానికంగానూ నాటు టమాటాలు ఇక్కడ పండించి రైతులు వివిధ మార్కెట్‌లకు తీసుకొస్తుంటారు. ఏటా ఏప్రిల్ నెలలో పంట అయిపోతుంది. మళ్లీ కొత్త పంట రావడానికి మూడు నెలలకు పైగా సమయం పడుతుంది. ఈ 90 రోజుల్లో ధర నిత్యం పెరుగుతూ పోతుంటుంది. ఇదే సమయంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు టమాటాలు ఎగుమతి జరుగుతుంటాయి. దీంతో పెరిగిన ధర తగ్గదు. ఆ పరిస్థితుల్లో మార్కెటింగ్ శాఖ టమాటాలను కొనుగోలు చేసి రైతుబజార్లలో కేజీ రూ. 50కి విక్రయిస్తుంటుంది. ఈ నేపథ్యంలో ధరలు ఆకాశాన్నంటకుండా తగిన కట్టడి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. రైతులు నేరుగా మార్కెట్‌లు, రైతుబజార్లకు వచ్చి విక్రయిస్తే ధర పెరిగే అవకాశం ఉండదని స్పష్టం చేసింది.

మార్కెట్ ఫీజు వసూళ్లలో అట్టడుగున పల్నాడు జిల్లా

గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ ఫీజు వసూళ్లలో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే చివరి స్థానం(26)లో నిలిచింది. ఈ జిల్లాకు రూ. 32.14 కోట్ల లక్ష్యంగా కాగా రూ. 25.31 కోట్లు మాత్రమే వసూలు చేసి 78.75 శాతం లక్ష్యానికి చేరింది. గుంటూరు జిల్లాకు రూ. 133.69 కోట్ల లక్ష్యం కాగా రూ. 117.86 కోట్లు వసూలు చేసి 88.16 శాతం లక్ష్యసాధనతో 21వ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా లక్ష్యం రూ. 30.27 కోట్లు కాగా రూ. 27.03 కోట్లు వసూలు చేసింది. 89.31 శాతం లక్ష్యసాధనతో 20వ స్థానంలో నిలిచింది.

100 శాతం పైగా వసూలు చేసిన ఏఎంసీలు

మార్కెట్ ఫీజుని 100 శాతం పైగా వసూలు చేసిన ఏఎంసీలను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అభినందించింది. గుంటూరు జిల్లా పొన్నూరు ఏఎంసీకి రూ. 6.95 కోట్లు లక్ష్యం కాగా రూ. 7.34 కోట్లు వసూలు చేసి 105.64 శాతం లక్ష్యానికి చేరుకొన్నది. అలానే దుగ్గిరాల ఏఎంసీ లక్ష్యం రూ. 3.27 కోట్లు కాగా రూ. 3.40 కోట్లు వసూలు చేసి 104.06 లక్ష్యానికి చేరింది. బాపట్ల జిల్లా చీరాల ఏఎంసీకి రూ. 3.59 కోట్లకు రూ. 3.71 కోట్లు, గుఏంటూరు జిల్లా ప్రత్తిపాడు ఏఎంసీ లక్ష్యం రూ. 3.72 కోట్లు కాగా రూ. 3.80 కోట్లు, తెనాలి ఏఎంసీకి రూ. 6.60 కోట్లు లక్ష్యానికి రూ. 6.71 కోట్లు, పల్నాడు జిల్లా వినుకొండ ఏఎంసీకి రూ. 2.93 కోట్లకు రూ. 2.93 కోట్లు, నరసరావుపేట ఏఎంసీకి రూ. 2.24 కోట్లకు రూ. 2.24 కోట్లు వసూలు చేసి 100 శాతం లక్ష్యాన్ని అధిగమించాయి. అలానే బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, గుంటూరు జిల్లాలోని తాడికొండ ఏంఎసీలు 90 శాతం పైగా లక్ష్యాన్ని అధిగమించాయి. ఇక 50 శాతం కంటే తక్కువ వసూలు చేసిన ఏఎంసీలో రొంపిచర్ల ఉన్నది. ఈ మార్కెట్ కమిటీకి రూ. 1.82 కోట్ల లక్ష్యం కాగా రూ. 79.72 లక్షలు మాత్రమే వసూలు చేయగలిగింది.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

● సగటున 90శాతం పైగా ఫలితాలు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గురుకుల కళాశాలలోని విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మరో సారి సత్తా చాటారు. మొత్తం 14 గురుకుల కళాశాలలు ఉండగా సగటున 93 శాతం పైగా ఉత్తీర్ణత నమోదైంది. గుంటూరు నగర సమీపంలోని అడవి తక్కెళ్ళపాడు, పల్నాడు జిల్లా కారంపూడి, రామకృష్ణాపురం, అచ్చంపేట, వీపీ సౌత్, ఉప్పలపాడు, అమరావతి, బాపట్ల, నిజాంపట్నం, రేపల్లె, చుండూరు, నాగులపాలెం బాపట్ల జిల్లాలోని నార్త్ అద్దంకి, యద్దనపూడి తదితర ప్రాంతాల్లో గురుకుల కళాశాలలు ఉన్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడవితక్కెళ్ళపాడు గురుకుల కళాశాల, బాపట్ల, విజయపురి సౌత్ గురుకుల కళాశాలలో 97% పైగా ఉత్తీర్ణత నమోదయింది. అదేవిధంగా రామకృష్ణాపురం, అచ్చంపేట, అమరావతి చుండూరు యద్దనపూడి కళాశాలల్లో సగటున 90% పైగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉత్తీర్ణత నమోదైంది. మొత్తం 888 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 791 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 97 మంది ఫెయిల్ కాగా సగటు ఉత్తీర్ణత శాతం 89.07గా నమోదైంది.

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో..

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అడవి తక్కెళ్ళపాడు గురుకుల కళాశాల నుంచి 63 మంది పరీక్ష హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులై నూరు శాతం ఉత్తీర్ణత శాతం నమోదు చేశారు. అదేవిధంగా అ చ్చంపేట, ఉప్పలపాడు, చుండూరు గురుకుల కళాశాలలో నూరు శాతం ఉత్తీర్ణత నమోదయింది. ఇంకా నార్త్ అద్దంకి కళాశాలలో 98శాతం నాగులపాలెం 94 శాతం, బాపట్ల 95శాతం, అమరావతి 96 శాతం, రామకృష్ణాపురం 93 శాతం ఉత్తీర్ణతతో అగ్ర స్థానంలో నిలిచాయి. ఇంటర్ పరీక్షలకు 760 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 701 మంది (92.23 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీ య సంవత్సరంలో 59 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని అడ్వాన్స్ సప్లిమెంటరీలో వారు కూడా పాస్ అయ్యేలా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు గురుకుల కళాశాలల కోఆర్డినేటర్ పద్మజా వెల్లడించారు.



అమరావతిలో..రయ్.. రయ్!

- ఏడీసీఎల్ నేతృత్వంలో రాజధానిలో 38 ప్యాకేజీలతో అభివృద్ధి పనులు
- ఇప్పటివరకు 14 ప్యాకేజీలకు టెండర్లు ఖరారు
- రాజధానిలో విశాలమైన రోడ్లకు టెండర్లు
- రోడ్ల వెంబడి పచ్చటి చెట్లు, పూల సోయగాలు
- రాజధానిలో పార్కుల అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) నేతృత్వంలో అమరావతి రాజధానిలో మొత్తం 38 ప్యాకేజీలలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించటం జరిగింది. వీటిలో ప్రస్తుతం 14 ప్యాకేజీలలో టెండర్లు పిలిచారు. మిగిలిన 24 ప్యాకేజీల పనులు ఇంకా ప్రణాళికల దశలో ఉన్నాయి. ఏడీసీ ఎల్ పిలిచిన 14 టెండర్లకు సంభంధించి చూస్తే.. తొలి మూడు ప్యాకేజీలు వరద నియంత్రణకు సంబంధించి పనులు చేపడుతుండగా.. మిగిలినవన్నీ మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాజధానిలో నిర్మిస్తున్న రోడ్లన్నీ కూడా సువిశాలమైన ఆరు వరుసల రహదారుల స్థానంలోనే ట్రంక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పనులు కూడా కలిసి ఉన్నాయి. వీటిలో సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, అవెన్యూ ప్లాంటేషన్ అభివృద్ధి, తాగునీటి సదుపాయం కోసం వాటర్ సప్లై నెట్‌వర్క్, మురుగునీటి నిర్వహణ కోసం సీవరేజ్ నెట్‌వర్క్, ఎక్కడ పడితే అక్కడ కరెంటు తీగలు, ఇంటర్‌నెట్ తీగలు, కేబుల్ తీగలు కనిపించకుండా ఉండటానికి భూగర్భంలోనే వాటిని వేసేందుకు వీలుగా యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్ లైన్లు, స్ట్రీట్ ఫర్నిచర్ వంటివి అభివృద్ధి చేపట్టాల్సి ఉంటుంది.

ప్యాకేజీల వారీగా ఖర్చు ఇలా..

ప్యాకేజి - 7లో భాగంగా ఈ-6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 452.96 కోట్లు, ప్యాకేజి - 8లో భాగంగా ఈ - 8 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 522.92 కోట్లు, ప్యాకేజి - 9లో భాగంగా ఎన్ - 11 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 419.85 కోట్లుప్యాకేజి - 10లో భాగంగా ఈ - 9 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.490.87 కోట్లు, ప్యాకేజి - 11లో భాగంగా ఈ - 14 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ.350.07 కోట్లు, ప్యాకేజి - 12లో భాగంగా ఎన్ - 12 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 614.56 కోట్లు, ప్యాకేజి -13లో భాగంగా ఎన్ - 6 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 232.86 కోట్లు, ప్యాకేజి - 14లో భాగంగా ఈ - 5 రహదారి నిర్మాణం అంచనా వ్యయం రూ. 807.75 కోట్లతో నిర్మించేందుకు ఏడీసీఎల్ టెండర్లు పిలవటం జరిగింది. ఇవి కాకుండా ప్యాకేజి - 4 పనులకు నిర్మాణ వ్యయం రూ.522.39 కోట్లు, ప్యాకేజి - 5 పనులకు నిర్మాణ వ్యయం రూ.98.17 కోట్లు, ప్యాకేజి - 6 లో భాగంగా ముఖ్యమైన మౌలిక సదుపాయాలతో ఎన్ - 15 రహదారి నిర్మాణ వ్యయం రూ.482.12 కోట్లతో చేపట్టేందుకు టెండర్లు పిలిచింది.

పచ్చదనం అభివృద్ధికి..

అమరావతి రాజధానిలో పచ్చదనం అభివృద్ధికి ఒక్కో రహదారికి రూ.5 కోట్ల చొప్పున మొత్తం 35 రోడ్లకు గాను రూ.175 కోట్లను ఖర్చు చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది. అమరావతిలో రోడ్ల మీద ప్రయాణించే వారికి సెంట్రల్ డివైడర్‌తో పాటుగా రెండు వైపులా అత్యద్భుతమైన పూలమొ క్కలు కనిపించేలా ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. అలాగే అమరావతిలో రూ. 25 కోట్ల వ్యయంతో ఆధునిక థీమ్ పార్కులను నిర్మించటానికి కూడా సీఆర్‌డీఏ సన్నద్ధమౌతోంది.



దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 1303 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,200, గరిష్ఠధర రూ.12,200, మోడల్‌ధర రూ.11,700 పలికాయి. కాయ కనిష్ఠధర రూ.10,200, గరిష్ఠధర రూ.12,225, మోడల్‌ధర రూ.11,700 పలికాయి.

నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు

ఫిరంగిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ నుంచి ఎం ఫార్మసీ వరకు చదివిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఫిరంగిపురంలోని సెయింట్ జేవీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీలో ఇంటర్వ్యూలు జరుగుతాయని కళాశాల నిర్వాహకులు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, బీఎస్సీ, బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్, ఎంఎస్సీ, ఎం ఫార్మసీలలో ఉత్తీర్ణులైన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వారు తెలిపారు. ఇంటర్వ్యూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. వివరాల కోసం 7842735467 నెంబరుకు తెలియజేయాలని వారు కోరారు.

18న చార్వాక రామకృష్ణ వర్ధంతి సభ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాస్తికోద్యమ నాయకులు చార్వాక రామకృష్ణ వర్ధంతి సభ ఈ నెల 18వ తేదీన మంగళగిరి మండలం నిడమర్రు గ్రామ పరిధిలోని చార్వాకాశ్రమంలో జరుగుతుందని నాస్తిక సమాజం జిల్లా కన్వీనర్ స్టాలిన్ తెలిపారు. పౌర హక్కుల సంఘం నాయకుడు డాక్టర్ టీ రాజారావు అధ్యక్షతన జరిగే ఈ సభలో గతి తార్కిక భౌతికవాద దృక్పథంలో నేటి సామాజిక పరిస్థితులు అనే అంశంపై చర్చ జరుగుతుందన్నారు. రామకృష్ణ కష్టజీవుల కుటుంబంలో పుట్టి అనేక ఉద్యమాల ద్వారా కష్టజీవుల పక్షాన జీవితకాలమంతా పోరాడారని చెప్పారు. వర్ధంతి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి 14వ సచివాలయం సీతానగరంలో ఉన్న రామకృష్ణ మిషన్ హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంలో గల అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులకు ఉపాధ్యాయులు యాజమాన్యం సూచనలు అందిస్తూ ప్రకృతిలోకి వచ్చే హానికర వ్యర్థాలను నివారించడంలో మానవజాతి చేసే పలు నివారణోపాయాలను వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి రోజూ బజారు కు వెళ్లేటప్పుడు చేతి సంచి తీసుకుని వెళ్లేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సదస్సులో పాల్గొన్న ఎంటీఎంసీ సిబ్బంది విద్యార్థులకు తెలిపారు.

కోళ్ల చోరీపై కేసు

దుగ్గిరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరంపూడి గ్రామంలోని ఓ ఇంట్లో కోళ్లను దొంగిలించినట్లు దుగ్గిరాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొండూరు అక్షయ్‌పాల్‌కుమార్ ఇంట్లోని రూ.30 వేల విలువ చేసే పెంపుడు కోళ్ల చోరీ చేసినట్లు పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ వెంకటరవి తెలిపారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంగళగిరి గండాలయపేటలో శ్రీరామ నవమి పందిరి ఏర్పాటు చేసిన 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి సహకారంతో మంగళవారం 300 మంది చిన్నారులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. శ్రీరామ నవమి పందిరి వద్ద బుధవారం పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం జరుగనుందని, దీని నిమిత్తం మంత్రి నారా లోకేశ్ 200 కిలోల బియ్యం అందించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు యుద్ధం అప్పారావు, పేరం ఏడుకొండలు, గోసాల రాఘవ, పంచల నాగభూషణం, గుంటి సాంబశివరావు, సూర్యప్రకాష్, మల్లూరి సతీష్, పచ్చల సురేష్, పొన్నెగంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత వెంకటరత్నం మృతి

ఫిరంగిపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం మండలంలోని శిరంగిపాలెం గ్రామానికి చెందిన రావిపాటి వెంకటరత్నం (87) సోమవారం రాత్రి స్వగ్రామంలో మృతి చెందారని సీపీఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి తెలిపారు. ఆయుర్వేద వైద్యంలో ట్రైనింగ్ పొంది సుదీర్ఘకాలం ప్రజలకు ఉచిత సేవలు అందించారని ఆయన తెలిపారు. సంతాప సభలో సీపీఎం జిల్లా నేతలు పాశం రామారావు, ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు, గుంటూరు విజయకుమార్, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యమేదైనా లక్ష్యం సమాజహితమే

● అవార్డు గ్రహీత అలపర్తి



అలపర్తి వెంకటసుబ్బారావును సత్కరిస్తున్న సాహితీవేత్తలు, కవులు, కళాకారులు

దుగ్గిరాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సాహిత్యమైదైనా దాని లక్ష్యం సమాజ హితమేనని కేంద్ర బాలసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న పురస్కార గ్రహీత బాలబంధు అలపర్తి వెంకటసుబ్బారావు అన్నారు. ముఖ్యమంత్రి నుంచి ఉగాదినాడు కళారత్న పురస్కారం అందుకున్న అలపర్తిని దుగ్గిరాలలో ఘనంగా సత్కరించారు. తిరుపతికి చెందిన కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత జిల్లెళ్ల బాలాజీ సత్కరించారు.

కలగానే లాం చప్టా నిర్మాణం

● కొండవీటి వాగు పొంగితే రాకపోకలు బంద్
● ప్రమాదాల అంచున ప్రయాణాలు
● రెయిలింగ్ దెబ్బతిన్నా పట్టించుకోని అధికారులు



లాం చప్టాపై దెబ్బతిన్న రెయిలింగ్

తాడికొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి ప్రధాన రహదారిలో ఉన్న లాం చప్టాకు మోక్షం లభించటం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా.. అధికారులు మారుతున్నా.. లాం చప్టాపై నూతన వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ఏళ్లు గడుస్తున్న ప్రస్తుత చప్టా స్థానంలో వంతెన నిర్మాణానికి అడుగులు ముందుకు పడటం లేదు. తాడికొండ మండలం లాం వద్ద కొండవీటి వాగుపై వంతెన శిథిలావస్థకు చేరుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు రద్దీగా ఉండే గుంటూరు - అమరావతికి ప్రధాన రహదారి. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాకాలం వచ్చిందంటే ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సిందే. కొండవీటి వాగు పొంగిపొర్లితే వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగు ఉధృతిగా ప్రవహిస్తే వాగు ప్రవాహం తగ్గే వరకు రోడ్డుకు ఇరువైపు వాహనాలు నిలిపోతున్నాయి. దీంతో గుంటూరు నుంచి రాజధాని గ్రామాలకు వెళ్లాలన్నా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే పల్నాడు జిల్లా అమరావతి మండలం నుంచి గుంటూరుకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి ఉంది. చప్టాపై రాత్రి సమయాల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించబోయి ప్రమాదాలు జరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారు లేకపోలేదు. లాం గ్రామం వద్ద ఉన్న లాం చప్టా. లాం వంతెన శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకునే వారే లేరు. వంతెనపై రెయిలింగ్ పూర్తిగా విరిగిపోయాయి. రాత్రి సమయాల్లో చప్టాపై జాగ్రత్తగా వాహనాలు నడపాల్సి వస్తుంది. వర్షాలు కురిసినప్పుడు వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోంది. వాహన రాకపోకలకు అంతరాయం కూడా ఏర్పడుతుంది. భారీ వర్షాలు పడినప్పుడు కొండవీటి వాగు పొంగి వాగులో కొట్టుకొనిపోయి ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒకసారి బిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినా పట్టా లెక్కలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. 2014-19 టీడీపీ ప్రభుత్వం హయాంలో లాంచప్టాపై వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లు నిధులు మంజూరు కాగా ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా రద్దు చేయటంతో ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు. అంతేగాకుండా గోరంట్ల గ్రామంలోని హోసన్న మందిరం నుంచి 14వ మైలు వరకు నాలుగు వరుసల రోడ్డును నిర్మించటానికి గత టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే శ్రీదేవి లాం చప్టాపై బ్రిడ్జి నిర్మాణాలు చేయటానికి ప్రయత్నాలు చేసినప్పటికి ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. 2024 ఎన్నికల సమయంలో లాం చప్టా నిర్మాణం చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం గురించి ఎలాంటి ఊసు లేదు. బ్రిడ్జి నిర్మాణం అటుఉంచితే దెబ్బతిన్న రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా లిఫ్టర్ల ప్రతిభ



పతకాలు సాధించిన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగిన ఏపీ స్టేట్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచి ప్రెస్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన లిఫ్టర్లు అద్భుత ప్రతిభ కనబర్చారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వివిధ విభాగాల్లో జిల్లాకు చెందిన లిఫ్టర్లు 20 బంగారు పతకాలు, 14 రజత పతకాలు, 4 కాంస్య పతకాలు సాధించడంతో పాటు మహిళల సబ్‌జూనియర్స్‌లో ద్వితీయ స్థానం, జూనియర్స్‌లో ప్రథమ స్థానం, సీనియర్స్‌లో తృతీయ స్థానం, పురుషుల సబ్‌జూనియర్స్‌లో తృతీయ స్థానం, జూనియర్స్‌లో తృతీయ స్థానం సాధించారని చెప్పారు. ఓవరాల్‌గా పురుషుల, మహిళల జట్లు 38 పతకాలతో చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం, సబ్‌జూనియర్స్, సీనియర్స్ మాస్టర్స్ విభాగాల్లో స్ట్రాంగ్ ఉమెన్ కోటాలో 4 పతకాలను సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను అసోసియేషన్ జిల్లా వైస్‌చైర్మన్ ఆర్‌వీఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బీ ప్రసాద్, పీ భాస్కర్, బీ చంద్రిక, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయి రేవతి, మస్తాన్‌వలి తదితరులు అభినందించారు.

పెదవడ్లపూడిలో ప్రత్యేక పారిశుధ్య పనులు



పెదవడ్లపూడిలో స్వచ్ఛ మంగళగిరిలో పాల్గొన్న కమిషనర్ అలీం బాషా తదితరులు

మంగళగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మంగళగిరిలో భాగంగా ఎంటీఎంసీ ఆధ్వర్యాన పెదవడ్లపూడిలో మంగళవారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. రోడ్ల వెంబడి చెత్తకుప్పలను ఏరివేసి, రోడ్లను శుభ్రం చేశారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రత, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛ మంగళగిరిపై అవగాహన పెంచుకుని చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, అడిషనల్ కమిషనర్ శకుంతల, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, కూటమి నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ-రీసర్వేపై అవగాహన ర్యాలీ



భూ-రీసర్వేపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

దుగ్గిరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భూముల వివాదాలు, పొలంగట్లు తదితర సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న భూ-రీసర్వేపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ ఐ సునీత భూ-రీసర్వేను ప్రజలు, రైతులు సద్వినియోగించుకోవాలంటూ అధికారులు సిబ్బందితో కలిసి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కనక దుర్గ, ఆర్ఐ త్రివేణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకూ మెయిన్‌రోడ్‌లో ప్లెక్సీతో ర్యాలీ నిర్వహించిన అనంతరం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో అవగాహన సదస్సులో పలువురు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మకు మల్లెలపూజ



అమ్మవారికి మల్లెల పూజ నిర్వహిస్తున్న భక్తులు

కాకుమాను, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండపాటూరులో భక్తుల కోర్కెలు నెరవేర్చే కల్పవల్లిగా పేరొందిన శ్రీ పోలేరమ్మ వారికి మల్లెపూల పూజ మంగళవారం వైభవంగా చేశారు. వేకువజాము నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలయం ముందు భాగంలో అమ్మవారి విగ్రహన్ని ప్రతిష్ఠించి శ్రీనివాసాచార్యుల బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపం వద్ద ఆలయ చైర్మన్ రామినేని నాగవేణి, తిరుపతిరావు దంపతులు, అలాగే కార్యనిర్వాహణ అధికారి సురేష్‌బాబు దంపతులు పూజలో పాల్గొన్నారు. మల్లెపూల పూజలో పాల్గొనేందుకు కొండపాటూరు, అప్పాపురం, కాకుమాను, గరికపాడు, కొమ్మూరు, పుసులూరు, తదితర గ్రామాలతో పాటు బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గతంలో ఆలయ ఈవోగా విధులు నిర్వహించిన జక్కా శ్రీనివాస్ తదితరులు కూడా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

దుగ్గిరాల - రేవేంద్రపాడు మెయిన్‌రోడ్ నిర్మాణం పూర్తి

● ఎన్నికల హామీని నెరవేర్చిన మంత్రి లోకేశ్



చింతలపూడి-రేవేంద్రపాడు మధ్య పూర్తయిన మెయిన్‌రోడ్డు

దుగ్గిరాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ తన ఎన్నికల ప్రచారంలో యిచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన దుగ్గిరాల-రేవేంద్రపాడు మెయిన్‌రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దశాబ్దకాలంగా గుంతలమయమైన రోడ్డుకు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో విజయవాడ, మంగళగిరి, తెనాలి పట్టణాలకు వెళ్లే ఉద్యోగులు, భవన నిర్మాణం, వ్యవసాయకూలీలు నిత్యం మెయిన్‌రోడ్‌లో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతుండేవారు. నిత్యం వందలాది భారీవాహనాలు, వేలాది ద్విచక్ర వాహనదారులు ప్రయాణించే తెనాలి - విజయవాడ మెయిన్‌రోడ్డులో తరచూ జరిగే ప్రమాదాలతో నానా అవస్థలు పడిన ప్రజలు నేడు అద్దంలా తీర్చిదిద్దిన రోడ్డు నిర్మాణం చేపట్టడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దుగ్గిరాల మండలపరిధిలోని నందివెలుగు సమీపంలోని ఆశ్రమ సమీపం వరకూ సుమారు 14కి.మీ.ల మేర రోడ్డును కొత్తగా నిర్మించడంతో వాహనాదారుల కష్టాలు తీరాయయంటూ వేనోళ్ల పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

కందుకూరి విశిష్ట పురస్కారానికి గాదె ఎంపిక



తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని రంగస్థల కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కందుకూరి విశిష్ట పురస్కారాలను అందజేయనుంది. ఈ పురస్కారానికి గుంటూరు జిల్లా నుంచి ఉండవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల టీవీ, సినీ నటుడు రచయిత, దర్శకుడు గాదె నాగభూషణం ఎంపికయ్యారు. ఏప్రిల్ 16న సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో గాదె నాగభూషణం ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకోనున్నారు. గాదె నాగభూషణంను కళారంగ ప్రముఖులు, ఉండవల్లి వాసులు అభినందించారు.

లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం



లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న22, 23 వార్డు ప్రజలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల పేదల ఇళ్ల పట్టాల కల నెరవేర్చిన ఘనత మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందని పలువురు వ్యాఖ్యానించారు. మంగళవారం పట్టణంలోని 22, 23 వార్డులకు చెందిన ప్రజలు లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ సుమారు 40 ఏళ్ల క్రితం మహానాడు ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం కూడా ఉండేది కాదని, ఆనాడు ఎన్టీఆర్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు సౌకర్యం కల్పించారని చెప్పారు. నేడు మంత్రి లోకేశ్ పట్టాలిచ్చి మా జీవితాల్లో వెలుగులు నింపారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో దారా దాసు, అన్నెం కుసుమ, గంధం సురేష్, లత, అశోక్, నరేంద్ర, రమాదేవి, ఈశ్వరి, కృష్ణవేణి, విశాల, పర్వీన్, అక్బర్, శ్యామ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



ఏపీఐఐసీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

మంగళగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఏపీ ఎంసీఏ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం హెల్త్ వెల్‌నెస్ సెంటర్ నోడల్ ఆఫీసర్ శ్యామల, ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్రహ్మణ్యంకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏపీ ఎంసీఏ అధ్యక్షుడు ఎన్ నిరంజన్, కార్యదర్శి బీ సందీప్‌కుమార్ మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు రెండు సంవత్సరాలుగా వేతనాల విషయంలో అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలని, ఈపీఎఫ్ పునరుద్ధరించాలని, క్లినిక్ బకాయిలు వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ నాయక్, జిల్లా అధ్యక్షురాలు ప్రవల్లిక, కార్యదర్శి లింగరాజు, శ్రీకాకుళం అధ్యక్షురాలు ఉషారాణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమలత, శివకృష్ణ, కార్తీకరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రో ధరలను తగ్గించాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత బాబూరావు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపిందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో ఆస్తిపన్ను అత్యధికంగా పెంచారని, పెంచిన పన్నులు వెంటనే తగ్గించాలని కోరారు. కృష్ణానదిపై రిటైనింగ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం నేతలు చెంగయ్య, పాశం రామారావు, ఎం రవి, ఈమని అప్పారావు, బి.వెంకటేశ్వర్లు, వీసం జవహర్‌లాల్, జేవీ రాఘవులు, పీ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ముగిసిన ఉద్యోగుల క్రీడలు



త్రోబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన మహిళా ఉద్యోగుల జట్టు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు వారాలుగా జరుగుతున్న ఉద్యోగుల క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీన వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా పోటీలను ప్రారంభించారు. ఎస్ఆర్ఎం మానవ వనరులు, స్పోర్ట్స్ విభాగాల ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రికెట్, త్రోబాల్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. వివిధ విభాగాలకు చెందిన 340 మంది ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్‌లో సీఎస్ఈ ప్రొఫెసర్స్ జట్టు విజేతగా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఉదయరాజ్, బెస్ట్ బౌలర్‌గా అన్వేష్, బెస్ట్ ఫీల్డర్‌గా డాక్టర్ రంజిత్ థాపా నిలిచారు. మహిళల విభాగం లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను వేదశ్రీతోపాటు మోనీ, కైవసం చేసుకున్నారు. త్రోబాల్‌లో అడ్మిన్ జట్టు విజేతగా నిలిచింది. క్యారమ్స్‌లో కే.శ్రీనివాసరావు, నవ్యకళ, రోప్ స్కిప్పింగ్‌లో రేణుకబాబు, రత్నప్రభ, బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఉదయరాజు విజేతలుగా నిలిచారు. విజేతలకు వీసీ మనోజ్‌కుమార్, రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ సీవీ టామీ, ఐజర్ సామల జిరార్డ్, జీ.సూప్ సూర్య వంశీ బహుమతులను ప్రదానం చేశారు. క్రీడా పోటీలను స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి, అసిస్టెంట్ డైరెక్టర్ సుస్మిత, కోచ్ వంశీ పర్యవేక్షించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

తాడేపల్లి (కుంచనపల్లి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ, జనసేన నేతలు మంగళవారం లబ్ధిదారులకు మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో పంపిణీ చేశారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన మద్దిరాల పార్వతికి రూ.48996లు, కుంచనపల్లి వెంకటరామ నరేంద్రకు రూ.26218లు విలువైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కానుగోలు కోటేశ్వరరావు, దాసెట్టి అరుణ, గంధం శ్రీనివాసరావు, నాగార్జున, జనసేన నేతలు కొవ్వూరి సురేష్, పసుపులేటి అశోక్, తోటకూర ప్రవీణ్, గడ్డం మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపూడిలో చెక్కుల పంపిణీ

దుగ్గిరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపూడికి చెందిన నల్లమామిడి హనుమంతరావు కుమార్తె జయశ్రీకి సీఎం సహాయ నిధి నగదు చెక్కును మంగళవారం అందించారు. ప్రమాదవశాత్తు కాలువిరిగిన జయశ్రీకి వైద్యఖర్చుల నిమిత్తం సాయం అందించాలని మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. స్పందించిన లోకేశ్ సీఎం సహాయనిధి నుంచి రూ.24వేలు మంజూరు చేశారు. నగదు చెక్కు పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీటీసీ వాసిరెడ్డి లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ నర్రా శ్రీనివాసరావు, నర్రా కోటేశ్వరరావు, శివ రామకృష్ణ, నాగసాయి, వాసు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మునిసిపల్ ఉపాధ్యాయుల ధర్నా నోటీసు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నోటీసు అందించామని ప్రోగ్రెసివ్ మునిసిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా యూనిట్‌గా మునిసిపల్ ఉపాధ్యాయులు కూడా బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని చలో కమిషనరేట్ ఎదుట ఈ నెల 17న ధర్నా చేయనున్నట్లు చెప్పారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు కూడా జరపాలని, జీపీఎఫ్ ఖాతాలు కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అత్యాచారం కేసులో తండ్రి అరెస్టు

తెనాలిరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కూతురుపై తండ్రి అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టుచేసి న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు రూరల్ ఎస్‌ఐ కట్టా ఆనంద్ తెలిపారు. ఓ వ్యక్తి తన కుమార్తెపై అత్యాచారం చేయటంపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఆ కేసులో నిందితుడిని మంగళవారం కొలకలూరు కాలువ కట్టవద్ద రూరల్ సీఐ ఉమేష్‌చంద్ర, ఎస్‌ఐ ఆనంద్‌లు కలిసి అదుపులోకి తీసుకున్నారు. న్యాయస్థానం ఎదుట హాజరు పరుచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

తెనాలిరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటన మండలంలోని పెదరావూరులో చోటుచేసుకుంది. మంగళవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో తెనాలి వైపు వస్తున్న ఓ ద్విచక్రవాహనం కొల్లూరు వైపు వెళుతున్న మరో ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు ద్విచక్రవాహనదారులు గాయపడ్డారు. వారిలో ఒకరికి తీవ్రగాయాలయినట్లు సమాచారం. స్థానికులు వారిని తెనాలిలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.



సిస్టర్ హృదయ మేరికి కిట్లు అందిస్తున్న సునీత

నిరాశ్రయులకు నిత్యావసరాలు అందజేత

తెనాలిరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో నిరాశ్రయులకు నిత్యావసరాలు అందజేశారు. మంగళవారం పట్టణంలోని జేఎంజే స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి కొల్లి హర్షవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం అతని భార్య కొల్లి సునీత టూత్ బ్రెష్‌లు, హెయిర్ ఆయిల్, సబ్బులు వంటి వ్యక్తిగత సంరక్షణ కిట్లను పంపిణీ హోమ్ నిర్వాహకురాలు సిస్టర్ హృదయ మేరికి అందజేశారు.

నేడు ముట్టడి నాటక పుస్తకావిష్కరణ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ రచయిత, కళాకారుడు పి.ప్రకాష్ రచించిన సాంఘిక నాటకం ముట్టడి పుస్తకావిష్కరణ బుధవారం నిర్వహించనున్నారు. కవిరాజా పార్కులోని సీనియర్ సిటిజన్ భవనంలో నిర్వహించే సమావేశంలో కమ్యూనిస్టు నాయకులు ఫణిరాందేవ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. కవులు, కళాకారులు హాజరు కావాలని రచయిత ప్రకాష్ కోరారు.

ఉమాశంకర్‌కు జాతీయ పురస్కారం

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): మన పొన్నూరు బ్లడ్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్‌కు జాతీయ ఉత్తమ సేవారత్న పురస్కారం లభించింది. సోమవారం విజయవాడ సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో జనసేవా సొసైటీ ఆధ్వర్యంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. విజయవాడ ఎమ్మెల్యే సుజనాచౌదరి, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా తిరుమలశెట్టి ఉమాశంకర్‌కు అవార్డును అంకున్నారు. గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రక్తదానం చేయడం పేదలకు అన్నదానం, వైద్య సేవలందిస్తున్నందుకు ఉమాశంకర్‌కు ఈ సేవా రత్న అవార్డు లభించింది. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు చిలకపాటి సింహాద్రి, పోలిశెట్టి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఉమాశంకర్



జిల్లా వైద్యశాల రోడ్డులో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

కాల్వల్లో కదలని మురుగు

● కాలువల దుస్థితిని పట్టించుకోవాలని పట్టణ వాసుల విజ్ఞప్తి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో కాలువలో మురుగునీరు పారుదల కాక దుర్గంధం వెదజల్లుతున్నాయి. మారీసుపేట, బాలాజీరావు పేట, చెంచుపేట, అమరావతి ప్లాట్స్, నాజరుపేట వంటి పలుప్రాంతాలలో డ్రెయిన్లలో నీరు పారుదల లేక వ్యర్థాతో నిండి తెట్టలు కట్టి దోమలకు ఆవాసాలుగా మారాయి. ఆ పరిసర ప్రాంతాలలో నివాసితులు కాలువలో వ్యర్థాలు కదలక రోజుల తరబడి నిలచి ఉండటంతో దుర్గంధం, దోమల బెడదతో అల్లాడిపోతున్నారు. మునిసిపల్ అధికారులు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా పారిశుధ్య పనులను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో ఇటువంటి పరిస్థితి ఉత్పన్నమవుతోందని ఆప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే అంటూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలంటూ అధికారులు హడావుడి చేస్తున్నారే తప్ప ప్రజలను చైతన్యవంతం చేయడలంలో విఫలమౌతున్నారన్న విమర్శలు కూడా పలువురి నుంచి వ్యక్తమౌతున్నాయి. గతంలో ఫాగింగ్ యంత్రాలతో వార్డుల్లో పొగ వదిలి దోమల నియంత్రణకు పురపాలక సంఘం బాధ్యతగా మెలిగేదని ప్రస్తుతం అవేవి కనబటంలేదంటూ మరికొందరు విమర్శలు చేస్తున్నారు. కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడం, గంబూసియా చేపలు వదలటం, కాలువల వెంట బ్లీచింగ్ చల్లడం వంటి పనులు ఈ మధ్యకాలంలో ఎక్కడా కనిపించండం లేదు. ఫలితంగా దోమలు పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలు దుర్గంధం, దోమకాటుతో అనారోగ్య సమస్యల బారిన పడకముందే పురపాలక సంఘం కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు, స్వచ్ఛంద సంఘ సభ్యులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

అగ్నిమాపక అధికారి వెంకట్రావు

తెనాలి క్రైం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని తెనాలి అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి అధికారి వెంకట్రావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల రెండో రోజున మంళవారం తెనాలి రైల్వే స్టేషన్, బస్టాండ్ ప్రాంగణాలలో ప్రజలకు నివారణ చర్యలపై ప్రదర్శన పూర్వక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలు ఎక్కువగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంట గ్యాస్ లీక్, సిగరెట్, బీడీలు ఆర్పివేయకుండా పడవేయడం వలన ప్రమాదాలు జరిగి ఆస్తి, ప్రాణనష్టం చోటు చేసుకుంటున్నాయన్నారు. గ్యాస్ సిలిండర్ లీక్ ప్రమాదాల నివారణ, అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తులను కాపాడే విధానం, పై అంతస్తులలో అగ్ని ప్రమాదం జరిగితే ప్రాణాలు కాపాడుకునే విధానంపై అవగాహన ప్రదర్శనలు ఫైర్ సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమాలలో రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటరమణ, ఆర్టీసీ డీఎం రాజశేఖర్, ఎల్ఎఫ్‌జీ సూరిబాబు, ఎల్ఎఫ్‌కే జితేంద్రకుమార్, సిబ్బంది చంద్రమోహన్, పీవీ సుబ్బారావు, ఎన్.రాజేష్, బుర్రా శ్రీనివాస్, జీవీ సుబ్బారావు, ఎం.నాగేశ్వరరావు, బి.రాజశేఖర్ పాల్గొన్నారు.



గ్యాస్ లీకేజీ ప్రమాదాల నివారణపై ప్రదర్శన చేస్తున్న సిబ్బంది

అప్రమత్తతోనే ప్రాణనష్టం నివారణ

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా వ్యవరించడంతోనే ప్రాణ నష్టాన్ని తప్పించవచ్చునని పొన్నూరు అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాదరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో మంటలు అదుపుచేసే పద్ధతులను ప్రదర్శించారు. ఫైర్ ఇంజిన్ ద్వారా వివిధ పరికరాలు వాడి మంటలు అదుపు చేసే పద్ధతులను గురించి వివరించారు. ఈ సందర్భంగా అగ్ని సురక్షిత భారతదేశానికి ఐక్యమవ్వండి అనే నినాదంతో రూపొందించిన కరపత్రాలను అగ్నిమాపక సిబ్బంది పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

తెనాలిరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ కోసం తెనాలి మండలంలో పలువురు లబ్ధిదారులు ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకూ లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించాల్సి ఉంది. అయితే తెనాలి పట్టణ, మండల గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్ల వాహనాలు నిర్ణీత సమయాల్లో కనిపించడంలేదు. దీంతో ఆయా ప్రాంతాల లబ్ధిదారులు వాహనం కోసం పడిగాపులు కాస్తున్నారు. మరో రెండు రోజుల్లో పంపిణీ చేసే సమయం ముగియనుండంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రేషన్ బియ్యం మాఫియాను కట్టడి చేసినప్పటికీ అక్కడక్కడా దాని ఆనవాళ్లు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వాహన ఆపరేటర్లు ఆయా ముఠాలతో కుమ్మక్కై బియ్యం పంపిణీ చేయడంలేదేమోనన్న అనుమానాలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. తాజాగా 12వ వార్డులో ఓ మహిళ బియ్యం కోసం ఎండీయూ ఆపరేటర్ వద్దకు వెళ్లగా తక్కువ స్టాక్ వచ్చాయని చెప్పడంతో పాటు మరలా వెంటనే డబ్బులిస్తానన డంతో ఆ మహిళ ఆశ్చర్యానికి గురైంది. అదేవిధంగా బాలాజీరావుపేట, కఠెవరం రోడ్డు ఇలా పలు ప్రాంతాల్లో రేషన్ బియ్యంకోసం లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు. దీనిపై అధికారులకు ఆయా ప్రాంతాల ప్రజలు సమాచారం ఇవ్వడంతో మంగళవారం హడావిడిగా వచ్చి రేషన్‌బియ్యం పంపిణీ చేశారు. ఆలస్యంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను జాన్‌ను వివరణకోరగా నాలుగు వాహనాలు డిస్ట్రిబ్యూషన్ విధుల్లో లేవన్నారు. మిగిలినవి చేస్తున్నాయన్నారు. నిలుపుదల జరిగిన వాహనాల ప్రాంతంలో కూడా మిగిలిన వాటి ద్వారా పంపడంతో పలు ప్రాంతాల్లో బియ్యం పంపిణీ ఆలస్యం అవుతుందన్నారు. బియ్యంకి బదులు డబ్బులు ఇస్తామన్న మాట తనకు ఎవ్వరూ ఫిర్యాదుచేయలేదన్నారు. విచారణ జరిపి వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పట్టణ మండల గ్రామాల్లో 85శాతం బియ్యం పంపిణీ జరిగిందని 15శాతం మాత్రమే జరగాల్సి ఉందన్నారు. ఫిర్యాదులు వస్తున్న ప్రాంతాల్లోనూ వాహనాన్ని పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో బియ్యం అందేలా చూస్తామన్నారు. ఒకవేళ సమయం దాటిన తరువాత లబ్ధిదారుల్లో ఎవ్వరికైనా బియ్యం అందకపోతే స్టాక్ నిల్వలను బట్టి అందించేలా చూస్తామని ఎవ్వరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాన్ పేర్కొన్నారు.



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక తదితరులు

డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించండి

● మునిసిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన డ్రెయిన్లలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక చెంచుపేటలోని ప్రధాన డ్రెయిన్లలోని సిల్టు తొలగింపు పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డ్రెయిన్లలోని సిల్ట్‌ను తొలగించాలని, మరికొన్ని డ్రెయిన్లలో సిల్ట్‌ను జేసీబీ యంత్రాలతో పూర్తిగా తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ పట్టణ ప్రజలు వ్యర్థాలను చెత్తను డ్రెయిన్లలో వేయరాదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ యాతాటి అనిల్, మునిసిపల్ టీపీవో ఎం సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

శ్రీవాసవీ ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

● భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోసురోడ్డులో ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఆదివారం సర్వసభ్య సమావేశం ఇరువర్గాలు, బయట వ్యక్తులు వచ్చారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ తోపులాట, గందరగోళం నడుమ వాయిదా వేశారు. ఒకవర్గం సర్వసభ్య సమావేశం తరువాత ప్రకటిస్తామని చెప్పగా, మరోవర్గం మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని స్పష్టం చేసింది. ఈ మేరకు సభ్యులు ఆలయ ఆవరణకు తరలివచ్చారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి సమావేశం నోటీసులు ఉన్న వారినే లోనికి అనుమతించారు. గత పాలకవర్గం కమిటీ కాల పరిమితి ముగిసిందని, నూతన కమిటీని ఎన్నుకుంటున్నట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు ప్రకటించారు. 200ల మందికి పైగా సభ్యులు హాజరయ్యారని వారి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు చెప్పారు. అధ్యక్షుడిగా పెండేల వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా బచ్చు సాంబశివరావు, కార్యదర్శిగా తాతా శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా పెండేల సుబ్బారావు, కోశాధికారిగా శ్రీరామ్ రాంజీ, సభ్యులుగా నూకల రాధాకృష్ణమూర్తి, కొప్పురావూరి హరికిషోర్, మువ్వల సుబ్బారావు, డోగిపర్తి చంద్రశేఖర్, చందోలు రమేష్, మాజేటి కృష్ణకిషోర్, కొల్లిపర రాధాకృష్ణమూర్తి, దేసు యుగంధర్, దేసు రవికుమార్, మానేపల్లి చంద్రశేఖర్, కూరపాటి రవికుమార్, తవ్వా నాగప్రసాద్‌లు ఎన్నికైనట్లు ప్రకటించారు. కాగా పాత పాలకవర్గం సంబంధించి ఈ సమావేశానికి ఎవరూ హాజరు కాకపోవడంతో వచ్చిన వారితోనే సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు.



సమాధుల తోటను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ శేషన్న తదితరులు

సమాధుల తోటలను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రానున్న ఈస్టర్ పండుగను పురస్కరించుకొని క్రైస్తవ సమాధుల తోటలను మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. మంగళవారం స్థానిక చినరావూరులో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్రైస్తవ సమాధుల తోటను పరిశీలించారు. ఈ సందర్భంలో ఆయన అధికారులకు సమాధుల తోటలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలని తోటను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పురపాలక సంఘ పరిధిలోని ఐతానగర్, పాండురంగపేటలోని సమాధుల తోటలను పరిశీలించి శానిటేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అగ్నిబాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

అగ్నిబాధిత కుటుంబానికి అండగా ఉంటాం

● టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతలక్ష్మీనారాయణ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిబాధిత కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతలక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని వేజెండ్లలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో చిలకా ఆంద్రియకు చెందిన గృహం దగ్ధమైంది. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు ఆంద్రియ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ నాయకులు తెలిపారు. మంగళవారం ఆంద్రియ కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసరాలను, ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో వేజెండ్ల నీటి సంఘం అధ్యక్షుడు గవిని రవీంద్ర, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వేజెండ్ల సుధాకర్, దాసరి రాజేష్, మోపర్తి అనిల్‌కుమార్, లింగాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలతకు వినతి పత్రాన్ని అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాలను విలీనం చేయవద్దంటూ నిరసన

కొల్లిపర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూములూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను (రెగ్యులర్) బేసిక్ ప్రైమరీ పాఠశాలగానే కొనసాగించాలని.. మా పిల్లలను వేరే మోడల్ ప్రైమరీ పాఠశాలకు పంపించడం ఇష్టం లేదంటూ మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాల నుంచి విద్యనందిస్తున్న ఘన చరిత్ర కలిగిన ప్రాథమిక పాఠశాలను రద్దుచేసి దానిని సమీపంలో ఉన్న మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడానికి ప్రయత్నాలు చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాల విలీన ప్రయత్నాన్ని విరమించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు విలీన ప్రయత్నాన్ని విరమించుకోవాలంటూ ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత వినతి పత్రాన్ని అందజేశారు.



విద్యార్థులకు పాదరక్షకులను పంపిణీ చేస్తున్న ఎంఈవోలు సాల్మన్‌రాజు, ఝాన్సీలత

విద్యార్థులకు పాదరక్షల పంపిణీ

కొల్లిపర, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.సాయి అందజేసిన పాదరక్షకులను ఎంఈవో ఝాన్సీలతతో కలిసి ఎంఈవో సాల్మన్‌రాజు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సాల్మన్‌రాజు మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలను విద్యార్థులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు రోజు, రోజుకు పెరుగుతున్నాయని విద్యార్థులు తప్పనిసరిగా పాదరక్షలను వేసుకుని రావాలన్నారు. దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో విద్యావనరుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

● సీడీపీవో ఎస్.వెంకటరమణ

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వలన రక్తహీనతను నివారించవచ్చునని సీడీపీవో ఎస్.వెంకటరమణ అన్నారు. పొన్నూరు పట్టణంలోని 7వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గర్భం దాల్చిన నాటి నుంచి కాన్పు అయ్యేవరకు అక్కడ నుంచి రెండు సంవత్సరాల వరకు మొత్తం వెయ్యి రోజులు సమయం పడుతుందన్నారు. వెయ్యిరోజుల పాటు ఆకుకూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు వంటి పౌష్టికాహారం స్వీకరించడం ద్వారా తల్లి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కె.శ్యామల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విలక్షణ కళాకారులకు విశిష్ట పురస్కారాలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక రాజధానిగా పేరు పొందిన తెనాలిలో విలక్షణ కళాకారులు ఉన్నారు. పలు పరిషత్‌లు స్థాపించి కళా రంగానికి సేవలు అందిస్తున్నారు. వీరిలో కందుకూరి విశిష్ట పురస్కారాలకు ఎంపికైన కళాకారుల వివరాలు. దుర్గాభవానీ నాట్యమండలి స్థాపించిన ఆరాధ్యుల ఆదినారాయణ బాల్యం నుంచే రంగస్థలంపై నటించారు. రాముడు, కృష్ణుడు, నారధునిగా, అర్జునుడు పలు పాత్రలలో అలరించారు. పౌరాణిక నాటకాల్లో పేరుపొందారు. ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు, ప్రముఖ కవి సినారె చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. ప్రముఖుడు ఏవీ సుబ్బారావు కుమారుడు ఆదినారాయణ. 1300లకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. మండలంలోని కొలకలూరుకు చెందిన గోపరాజు విజయ్ నాలుగు దశాబ్దాలుగా రంగస్థలంలో ఉన్నారు. ఆయన తండ్రి రమణ కూడా సినీ, రంగస్థలంలో ప్రముఖ నటుడు. కొలకలూరులో పరిషత్ ఏర్పాటు చేసి నాటకాలను ప్రతిఏటా ప్రదర్శిస్తుంటారు. సినిమాలు, బుల్లితెరపై కూడా నటిస్తున్నారు. రంగస్థల ప్రదర్శనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన ప్రముఖ సంస్థ సురభిలో ఉన్న కళాకారిణి ప్రభావతి. ఈ సంస్థకు 137 ఏళ్ల చరిత్ర ఉంది. పలు సాంఘిక నాటికల్లో నటించిన ఆమె పద్య పఠనంలో దిట్ట. 2వేలకు పైగా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. సినిమాల్లోను నటించి పలు రివార్డులు, అవార్డులు దక్కించుకున్నారు. పద్యకవిగా, వ్యాఖ్యాతగా, నటుడిగా అయినాల మల్లేశ్వరరావు పేరుగాంచారు. ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయన విశ్రాంత జీవితాన్ని రంగ స్థలానికి అంకితం చేశారు. పలు నాటికలు, శతకాలు, స్థల పురాణాలు, చరిత్రలు లిఖించారు. అనువాదం, డాక్యుమెంటరీలు, సీడీల రూపకల్పన, సన్మాన పత్రాల తయారీలో పేరు పొందారు.

ఈ కేవైసీని పూర్తిచేయాలి: తహసీల్దార్

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల ఈ కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని తహసీల్దార్ ఎండీ జియావుల్‌హక్ ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని మునిపల్లెలో ఈ కేవైసీ వెరిఫికేషన్ ప్రక్రియను తహసీల్దార్ తనిఖీచేశారు. ఈ సందర్భంగా సిబ్బంది రేషన్ డీలర్లు ఈ కేవైసీ చేయించుకోని వారి జాబితాను వెంటబెట్టుకొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ కేవైసీ చేయాలని సూచించారు. కేవైసీ పూర్తి చేయకుంటే లబ్ధిదారులకు రేషన్ నిలిచిపోయి కార్డుల్లో వారి వివరాలు కనిపించవన్నారు. దీని వలన లబ్ధిదారులకు నష్టం చేకూరుతుందన్నారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లెలో ఈకేవైసీ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు